నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ | ఆదివారం 4-7-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 275 | పేజీలు: 4 | వెల: రూ.1/-

పరిశుభ్రంగా ఉండండి.. అంటువ్యాధులను అరికట్టండి : మంత్రి కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, జులై 3: (నేటినిజం ప్రతినిధి): ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే.. అంటు వ్యాధులను అరికట్టొచ్చు అని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. వేములవాడ మున్సిపాలిటీలోని 10వ వార్డులో నిర్వహించిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. పట్టణ ప్రగతిలో భాగంగా కూలిపోయిన ఇండ్లు, కంకర కుప్పలను తొలగించాలన్నారు. వేములవాడ పట్టణం దక్షిణ కాశీగా పేరు గాంచింది. రాజన్న ఆలయానికి రోజు వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకొని.. ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. రహదారుల విస్తరణ, పారిశుద్ధ్య నిర్వహణ, చెట్ల పెంపకంపై దృష్టి సారిస్తామన్నారు. వేములవాడ పట్టణంలో మౌలిక వసతులు కల్పిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

ఒక్క రూపాయికే నల్లా కనెక్షన్

మిషన్ భగీరథ లైన్ 60 శాతం పూర్తి అయిందని పేర్కొన్న కేటీఆర్.. దసరా లోపు వేములవాడ పట్టణంలో ఉన్న 14 వేల కుటుంబాలకు నల్లా నీరు అందిస్తాం అని చెప్పారు. ఒక్క రూపాయి చెల్లించి నల్లా కనెక్షన్ తీసుకోవచ్చు అని సూచించారు. వేములవాడలో మార్కెట్ నిర్మాణం కోసం రూ. 5 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. గడిచిన ఏడేళ్లలో వేములవాడ అభివృద్ధి ఎలా ఉందో మీరే చూసి చెప్పాలన్నారు. 10వ వార్డులో కమ్యూనిటీ మహిళా భవనానికి తక్షణమే రూ. 20 లక్షలు మంజూరు చేస్తామని మంత్రి కేటీఆర్ వెల్లడించారు.

నీటిపారుదలపై ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక సమీక్ష

హైదరాబాద్ , జులై 3: రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నీటిపారుదలపై కీలక సమీక్ష చేపట్టారు. ఏపీతో కృష్ణా జలాల వివాదం నేపథ్యంలో నీటిపారుదలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో నీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఈఎన్సీ, నీటిపారుదలశాఖ ఇంజినీర్లు హాజరయ్యారు.

వేములవాడ పట్టణ అభివృద్ధికి సిద్ధం : మంత్రి కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, జులై 3: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణ అభివృద్ధికి తాను సిద్ధంగా ఉన్నానని, పాలకవర్గం కలిసికట్టుగా ప్రతిపాదనలు అందించాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు. వేములవాడ పురపాలక సంఘం పాలకవర్గంతో.. పట్టణ అభివృద్ధిపై రెండు గంటల పాటు సుదీర్ఘంగా చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. మరో 15 రోజుల్లో వచ్చి పట్టణంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తాను. పరిశుభ్రత, పచ్చదనంతోపాటు అవసరమైన అభివృద్ధి పనులను కూడా అప్పటికప్పుడు అంచనా వేద్దామన్నారు. పాలకవర్గ సభ్యులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి పనులు చేయించాలన్నారు. మున్సిపల్ పరిపాలన భవనంలో అవసరమైన సామాగ్రిని కూడా అంచనా వేస్తే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారులు విస్తరించేందుకు.. సంబంధిత యజమానులతో చర్చించి, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. వేములవాడ మండల పరిషత్ కార్యాలయం కాంప్లెక్స్ లోనూ క్రీడా ప్రాంగణాల నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలన్నారు. తిప్పాపూర్‌లోని స్టేడియం పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.

మరో స్మృతి వనం ఏర్పాటు చేద్దాం

వేములవాడ పట్టణంలో నిర్మాణంలో ఉన్న స్మృతివనం వెంటనే పూర్తి చేసి, మరో స్మృతివనం నిర్మాణానికి స్థలాన్ని కూడా ఎంపిక చేయాలని మంత్రి కేటీఆర్ సూచించారు. మర్రిపల్లిలో ఉన్న 200 ఎకరాల్లో అర్బన్ డెవలప్‌మెంట్ కింద అటవీ పార్కు నిర్మిద్దామన్నారు. ఈ క్రమంలో ఆ ప్రాంతాన్ని పరిశీలించాలని తాసిల్దార్, కమిషనర్‌కు ఆదేశించారు. చెరువు శిఖం భూముల్లో ఐదు ఎకరాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించాలని మంత్రిని కౌన్సిలర్ మహేష్ కోరారు. పార్కులు, చిన్నారుల ఆటల కోసం కూడా స్థలాలు ఎంపిక చేస్తే తప్పనిసరిగా అభివృద్ధి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. విలీన గ్రామాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించుదామని చెప్పారు. ఇందుకనుగుణంగా నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. స్మృతివనం, పార్కుల కోసం స్థలాలు కూడా గుర్తించి అంచనాలు రూపొందించాలి అని కేటీఆర్ ఆదేశించారు.

కమిషనర్‌పై ఆగ్రహం

మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగులకు బయోమెట్రిక్ విధానం అమలు లేకపోవడాన్ని కమిషనర్ పై మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు పరిపాలన అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించం అని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధ్యక్షురాలు మాధవి, మున్సిపల్ శాఖ డైరెక్టర్ సత్యనారాయణ, కలెక్టర్ కృష్ణ ప్రసాద్, విటీడీఏ వైస్ చైర్మన్ ముద్దసాని పురుషోత్తం రెడ్డి, ఈఎన్సీ శ్రీధర్, ఎస్ఈ శ్రీనివాస రావు, విటీడీఏ కార్యదర్శి భుజంగరావు, కమిషనర్ శ్యామ్ సుందర్ రావు, డిఈ ప్రసాద్, సెస్ ఏడి సత్తయ్య, ఏఈ సుష్మా, మున్సిపల్ ఏఈలు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధిని ఏ శక్తి అడ్డుకోలేదు : మంత్రి శ్రీనివాస్ గౌడ్

యాదాద్రి భువనగిరి, జులై 3: : తెలంగాణ అభివృద్ధిని ఏ శక్తి అడ్డుకోలేదు.. రాష్ట్రానికి అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని మంత్రి శ్రీనివాస్ గౌడ్ తేల్చిచెప్పారు. భువనగిరి మండలం వడాయిగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న విగ్రహాన్ని మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణకు నష్టం జరిగితే పార్టీలకతీతంగా ఐక్యం కావాలన్నారు. ఎంతో మంది ప్రాణాల త్యాగఫలం తెలంగాణ అని పేర్కొన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. రాష్ట్రంలోని కుల వృత్తుల కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్, రైతు బంధు, రైతు బీమా, గీతా కార్మికులకు ఎక్స్ గ్రేసియా, ఇలా ఏదో ఒక పథకాన్ని లబ్దిపొందని కుటుంబం లేదన్నారు. గ్రామాలకు కరోనా కాలంలో కూడా నిధులను ప్రభుత్వం జమ చేసిందన్నారు. గ్రామాలకు ప్రభుత్వం ఇచ్చే నిధులను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

హైదరాబాద్ ట్యాంక్ బండ్ సమీపంలో రూ. 9 కోట్లతో నీరా కేఫ్‌ను ప్రభుత్వం త్వరలో ఏర్పాటు చేయనుందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. భువనగిరి మండలంలోని నందనవనంలో రూ. 6 కోట్లతో నీరా ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. 60 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి 7 సంవత్సరాల్లో తెలంగాణ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, అందోళ్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్ గౌడ్, ఎంపీపీ నరాల నిర్మల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైపుల ద్వారా ఇండియాలోకి చొరబడ్డ బంగ్లాదేశీయులు

హైదరాబాద్ , జులై 3:దేశంలోకి అక్రమంగా చొరబడిన ఎనిమిది మంది బంగ్లాదేశీయులు ఏపీ పోలీసుల అదుపులో ఉన్నారు. వీరు బెంగాల్‌లోని హావ్‌డా నుంచి రైళ్లలో ప్రయాణించి రాష్ట్రానికి చేరుకున్నారు. కేంద్ర నిఘా విభాగం ఇచ్చిన సమాచారంతో రాజమహేంద్రవరం, విజయవాడలో ఆర్‌పీఎఫ్ సిబ్బంది బంగ్లాదేశీయులను పట్టుకున్నారు. నలుగురు బంగ్లాదేశీయులను విజయవాడలోని సత్యనారాయణపురం పోలీసులు విచారిస్తున్నారు. హావ్‌డా–వాస్కోడిగామా రైళ్లో వస్తున్న వీరి వద్ద ఎలాంటి అధికారిక పత్రాలు లేకపోవడంతో అదుపులోకి తీసుకున్నారు. పాస్‌పోర్టు లేకుండా డ్రైనేజీ పైపుల ద్వారా భారత్‌లోకి వచ్చినట్లు విచారణలో తేలింది.

బెంగళూరు చిరునామాతో నకిలీ ఆధార్, పాన్ కార్డు, ఓటర్ కార్డు ఉన్నట్లు గుర్తించారు. 2017 నుంచి 2019 వరకు వీరు గోవాలో ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. కొవిడ్ కారణంగా 2019 తర్వాత బంగ్లాదేశ్‌కు వెళ్లినట్లు గుర్తించారు.

ఈ ఏడాది జూన్‌లో మళ్లీ గోవా వచ్చినట్లు విచారణలో వారు వెల్లడించినట్లు సమాచారం. విజయవాడలో నలుగురు బంగ్లాదేశీయులను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేశాం. సెల్‌ఫోన్లు, నకిలీ కార్డులు స్వాధీనం చేసుకున్నాం. ప్రాథమికంగా విచారణ చేశాం.. మరింత విచారించాల్సి ఉందని విజయవాడ నార్త్ జోన్ ఏసీపీ షానూ షేక్ తెలిపారు.

మరో వివాదంలో మమత సర్కార్.. మహిళకు టీకా వేసిన టీఎంసీ కౌన్సిలర్

కోల్‌కతా, జులై 3:: పశ్చిమ బెంగాల్‌లోని సీఎం మమతా బెనర్జీ ప్రభుత్వానికి తాజాగా మరో వివాదం చుట్టుకున్నది. అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కి చెందిన కౌన్సిలర్ ఒక మహిళకు కరోనా టీకా వేయడంపై బీజేపీ మండిపడింది. అసన్‌సోల్‌లో ఇటీవల మెగా కరోనా టీకా శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సందర్శించిన స్థానిక టీఎంసీ కౌన్సిలర్ తబస్సుం అరా పక్కన డాక్టర్లు, నర్సులు ఉండగా ఒక మహిళకు స్వయంగా టీకా వేశారు. దీనిపై బీజేపీ నేతలు విమర్శలు చేశారు. ఎలాంటి అనుభవం లేని వారు కరోనా టీకా వేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆ పార్టీ నేతలు బాబుల్ సుప్రియో, అగ్నిమిత్ర పాల్ ఆరోపించారు. పాలక సభ్యులపై టీఎంసీకి నియంత్రణ లేనట్లుగా కనిపిస్తున్నదని విమర్శించారు. దీనికి సంబంధించిన వీడియోను తమ ట్విట్టర్ ఖాతాల్లో పోస్ట్ చేశారు.

సర్దార్ పటేల్ నేషనల్ యూనిటీ అవార్డు -2021 కోసం నామినేషన్లు ఆహ్వానం

న్యూఢిల్లీ, జులై 3:సర్దార్ పటేల్ నేషనల్ యూనిటీ అవార్డు–2021కు అర్హులైనవారు తమ నామినేషన్లను పంపడానికి లేదా అర్హులైనవారి తరఫున ఇతరులు సిఫారసు చేయడానికిగాను ఆగస్టు 15 చివరి తేదీ అని కేంద్ర హోంశాఖ తెలిపింది. దేశ ఐకమత్యం, సౌభ్రాతృత్వం కోసం కృషి చేసేవారికి ఇచ్చే ఈ అవార్డును సర్దార్ వల్లభాయి పటేల్ పేరుతో కేంద్ర హోంశాఖ ప్రారంభించింది. జాతీయ ఐకమత్యాన్ని కాపాడుతూ భారతదేశ సాధనకోసం కృషి చేసేవారి స్ఫూర్తిదాయక సేవలను గుర్తించడానికి ఈ అవార్డును నెలకొల్పారు.

కుల,మత,ప్రాంత,రాజకీయాలు,వయస్సు,వృత్తికి అతీతంగా ఎవరైనా సరే ఈ అవార్డుకోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యక్తులే కాదు సంస్థలు కూడా ఈ అవార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. భారత దేశంలోని ఏ వ్యక్తయినా,ఏ సంస్థయినా సరే అర్హత వున్నవారిని,అర్హత వున్న సంస్థల పేర్లను ఈ అవార్డు కోసం సిఫారసు చేయవచ్చు. రాష్ట్ర ప్రభుత్వాలు,కేంద్ర పాలిత ప్రాంతాలు,ఆయా కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖలు కూడా అవార్డుకోసం దరఖాస్తు చేయవచ్చు. https://nationalunityawards.mha.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులను పంపవచ్చు.

మైనారిటీల ఉన్నతికి ప్రభుత్వం కృషి : మంత్రి కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్ , జులై 3: మైనారిటీల ఉన్నతికి ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నట్లు రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో డ్రైవర్ కమ్ ఓనర్ స్కీం కింద ఎంపికైన 106 మంది లబ్ధిదారులకు మారుతి కార్లను మంత్రులు కొప్పుల ఈశ్వర్, మహమూద్ అలీ అందజేశారు.

నగరంలోని నాంపల్లి హజ్ భవన్‌లో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గొప్ప లౌకికవాది అన్నారు. వారి సుపరిపాలనలో రాష్ట్రంలో మత సామరస్యం వెల్లివిరుస్తోందన్నారు.

రాష్ట్రంలో మైనారిటీల భద్రత, సంక్షేమం, సముద్ధరణకు కేసీఆర్ అంకితభావంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. డ్రైవర్ కమ్ ఓనర్ పథకం వినూత్నమైనదన్నారు. ఇటువంటిది దేశంలో మరెక్కడా కూడా అమలు కావడం లేదన్నారు. నిరుద్యోగ యువత ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు, వారి కుటుంబ జీవన పరిస్థితులు మెరుగయ్యేందుకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. మైనారిటీలను ఉన్నత విద్యావంతుల్ని చేసేందుకు 204 గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి వివరించారు.హోం మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. 10 వేల మంది ఇమామ్, మౌజమ్ లకు ప్రతి నెల రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం అందిస్తున్నామన్నారు. మైనారిటీలందరూ సీఎం కేసీఆర్‌కు సంపూర్ణ మద్దతునిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎ.కె.ఖాన్, ప్రభుత్వ కార్యదర్శి అహ్మద్ నదీమ్,ఎమ్మెల్సీ హసన్ ఎఫెండి, ఎమ్మెల్యే హుస్సేన్ మీరజ్, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ మహ్మద్ సలీం, ఉన్నతాధికారులు షానవాజ్ ఖాసీం, కాంతివెస్లీ, యూనస్, స్థానిక కార్పొరేటర్ సురేఖ, హజ్ భవన్ మసీదు ఇమామ్ సాబేర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నేటినిజం



హైదరాబాద్ పాతనగర కవుల వేదిక
సురభి ఎడ్యుకేషనల్ సొసైటి
సంయుక్త ఆధ్వర్యంలో

పి.వి. శతజయంతి కవితల పోటీ

హైదరాబాద్ పాతనగర కవుల వేదిక స్వర్గీయ శ్రీ పి.వి.నరసింహారావు శతజయంతి (1920–2021) సందర్భంగా నిర్వహించిన కవితల పోటీలో విజేతలను ప్రకటించింది.

విజేతల బ్యాంక్ అకౌంటుకు బహుమతి మొత్తం ట్రాన్స్‌ఫర్ చేయబడుతుంది.కావున విజేతలందరూ తమ బ్యాంక్ అకౌంట్ నెంబర్‌ను కార్యదర్శికి వాట్సప్‌లో (వాట్సప్ నెం. 9703542598, 9182178653) వెంటనే పంపాలి.

బహుమతి పొందిన కవితలు

మొదటి బహుమతి	:	లోపలి మనిషి – శ్రీ సూటెంకి రవీంద్ర
ద్వితీయ బహుమతి	:	బలగంలేని బలమైన నాయకుడు – శ్రీ గుండేటి రమణ
తృతీయ బహుమతులు	:	1. తోరణాలు – శ్రీమతి అరుణ నారదభట్ల
		2. నీవు ఎవరు? – శ్రీమతి పి.వి.ఎస్. కృష్ణకుమారి
ప్రత్యేక బహుమతి	:	పీవీ లీవి – శ్రీమతి మంజుల సూర్య
కన్సోలేషన్ బహుమతులు	:	1. రథసారథి – శ్రీమతి ములుగు లక్ష్మీమైథిలి
		2. నిన్ను తలంచి– శ్రీమతి సమ్మెట విజయ
		3. శేషకీర్తి సువర్ణఛత్రం – శ్రీ కొత్తపల్లి ఉదయబాబు
		4. స్మరణ – శ్రీ గుమ్మడి సాంబమూర్తి
		5. సహస్రఫణి – శ్రీ తిరునగరి శ్రీనివాస్
		6. అపర చాణక్యుడు – శ్రీమతి దేవుల కమలాకర్ సుజాత
		7. ఆయనొక మౌని – శ్రీమతి పూసల రజనీ గంగాధర్
		8. స్థిత ప్రజ్ఞాశాలి – శ్రీ కొలిపాక శ్రీనివాస్
		9. దేశగతి మార్చిన మహాఋషి – వాడపర్తి వెంకటరమణ

కవితల పోటీలో పాల్గొని బహుమతి పొందినవారిని, ప్రోగ్రాంలో పాల్గొన్న కవులు, కవయిత్రులకు మరియు ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన శ్రీమతి శీలా సుభద్రాదేవి, డా॥ కొండపల్లి నీహారిని, శ్రీ వి.పి. చందర్ రావు గారలకు సురభి ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్‌పర్సన్ మరియు ఎమ్.ఎల్.సి. శ్రీమతి సురభి వాణిదేవి గారు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నారు.

కొరుప్రోలు హరనాథ్
కార్యదర్శి
హైదరాబాద్ పాతనగరం కవుల వేదిక

వైఎస్ఆర్‌ను తిడితే జగన్ వదిలేసినా.. మేం వదలం: రేవంత్ రెడ్డి

హైదరాబాద్ , జులై 3:ఏపీ, తెలంగాణ మధ్య జల జగడం నెలకొన్న నేపథ్యంలో తెలంగాణ మంత్రులు దివంగత నేత వైఎస్ఆర్‌ను తీవ్ర పదజాలంతో దూషిస్తుండడంపై నూతన టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. వైఎస్ఆర్‌ను తిడితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు.

'వైఎస్ఆర్‌ను విధాన పరంగా ఎవరైనా విమర్శిస్తే తప్పులేదు. కానీ చనిపోయిన వ్యక్తి పట్ల దుర్మార్గంగా మాట్లాడుతున్నారు. వైఎస్ఆర్ పేరు మీద ఏర్పాటు చేసుకున్న పార్టీకి విజయమ్మ గౌరవాధ్యక్షురాలు. జగన్ ఆ పార్టీకి అధ్యక్షుడు, ఒక రాష్ట్రానికి సీఎం.

అలాంటి వాళ్లిద్దరూ వైఎస్ఆర్‌ను తిడుతుంటే ఖండించడంలేదు. వాళ్లు వైఎస్ఆర్‌ను వదిలేసుకున్నారని భావించాలేమో. వైఎస్ఆర్‌ను తిడితే జగన్ వదిలేయొచ్చు? కానీ మేం వదిలిపెట్టం? వైఎస్ పై నోటికొచ్చినట్టు మాట్లాడితే ఈ మంత్రుల చెంపచెళ్లుమనిపిస్తాం. ఇక్కడున్న కాంగ్రెస్ శ్రేణులు చూస్తూ ఊరుకోవు. వైఎస్సార్? తెలంగాణ కాంగ్రెస్ ఆస్తి. ఆయన బతికున్నంతకాలం కాంగ్రెస్ పార్టీకి సేవలు చేశారు. చనిపోయే ముందు కూడా రాహుల్ గాంధీని ఈ దేశానికి ప్రధానిగా చూడాలని ఆకాంక్షించారు' అని వివరించారు. తుచ్ఛమైన రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్టీఆర్, వైఎస్ఆర్ పేర్లను లాగడం మానుకోవాలని తెలంగాణ మంత్రులకు రేవంత్ హితవు పలికారు. ఎన్టీఆర్, వైఎస్ఆర్ తమ పాలనలో చేయగలిగినంతా చేశారని, కొన్ని నిర్ణయాల్లో అన్నీ అందరికీ నచ్చకపోవచ్చని, అంతమాత్రాన వారిని ఈ వివాదాలకు బాధ్యులను చేయడం సరికాదన్నారు.

ఒక్క డోసు తీసుకున్నా.. మరణాల నుంచి 92 శాతం రక్షణ

హైదరాబాద్ , జులై 3:కరోనా వ్యాక్సిన్ రెండు డోసులు వేసుకుంటే మహమ్మారి మరణాల ముప్పును 98 శాతం తగ్గించవచ్చని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఒక్క డోసు తీసుకున్నా ఆ ముప్పు 92 శాతం తక్కువగా ఉంటుందని పేర్కొంది. పంజాబ్ లో వ్యాక్సిన్ తీసుకున్న పోలీసులపై చండీగఢ్ లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ చేసిన అధ్యయనంలో ఈ విషయం తేలిందని తెలిపింది. ఆ అధ్యయన సమచారాన్ని నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వి.కె. పాల్ వెల్లడించారు.

35,856 మంది పోలీసులు ఒక్కడోసు వ్యాక్సిన్ తీసుకుంటే.. అందులో కరోనా సోకి 9 మంది చనిపోయారని, వ్యాక్సిన్ తీసుకున్న సిబ్బందిలో కరోనాతో చనిపోయింది 0.25 శాతమేనని చెప్పారు. రెండు డోసులు తీసుకున్న 42,720 మందిలో కేవలం ఇద్దరే (0.05%) చనిపోయారన్నారు. అయితే, వ్యాక్సిన్ తీసుకోని 4,868 మంది సిబ్బందిలో 15 మంది మృత్యువాత పడ్డారన్నారు. కాబట్టి వ్యాక్సిన్ వేసుకుంటే కరోనా తీవ్రత తగ్గడమే కాకుండా మరణాల ముప్పునూ గణనీయంగా తగ్గించొచ్చని, అందరూ ధైర్యంగా టీకాలు వేసుకోవాలని ఆయన సూచించారు.

కరోనా సెకండ్ వేవ్ ఇంకా పూర్తి కాలేదు: కేంద్రం

హైదరాబాద్ , జులై 3:దేశంలో కరోనా సెకండ్ వేవ్ ఇంకా ముగియలేదని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రజలు అలసత్వంగా ఉండొద్దని సూచించింది. రోజువారీ కేసులు తగ్గుతున్నా జూన్ 23తో ప్రారంభమైన వారంలో 71 జిల్లాల్లో కరోనా పాజిటివిటీ రేటు 10 శాతానికి పైగా నమోదైనట్లు గుర్తుచేసింది. దేశంలో ఇప్పటికీ చాలా రాష్ట్రాల్లో సమస్యాత్మక జిల్లాలు ఉన్నట్లు నీతి ఆయోగ్ సభ్యుడు వీకే పాల్ తెలిపారు.

కరోనా సెకండ్ వేవ్ పూర్తిగా తగ్గిపోయిందన్న ఉద్దేశంతో నిర్లక్ష్యం ప్రదర్శించకూడదని వీకే పాల్ సూచించారు. యూరప్‌లో మళ్లీ కేసులు పెరుగుతున్న విషయాన్ని ప్రజలు దృష్టిలో పెట్టుకోవాలని హెచ్చరించారు. మరోవైపు దేశంలో వ్యాక్సినేషన్ పురోగతిని కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ లవ్ అగర్వాల్ వివరించారు. జూన్ 21 నుంచి రోజుకు సగటున 50 లక్షల మందికి టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. జనవరి 16న కరోనా వ్యాక్సినేషన్ ప్రారంభం కాగా ఇప్పటివరకు 34.41 కోట్లకు పైగా వ్యాక్సిన్ డోసులు వేసినట్లు పేర్కొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించినప్పుడే హరిత హారం విజయవంతం

జగిత్యాల, జులై 3: : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించినప్పుడే హరిత హారం విజయవంతమైనట్లు అని జగిత్యాల టీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ స్పష్టం చేశారు. జగిత్యాల నియోజకవర్గం పరిధిలోని గోవిందపల్లె ఆరో వార్డులో నిర్వహించిన హరిత హారం కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్, మున్సిపల్ చైర్ పర్సన్ బోగ శ్రావణి కలిసి పాల్గొని మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. హరితహారం విజయవంతం చేయడానికి ప్రజా ప్రతినిధులు అధికారుల సమన్వయంతో పాటు పట్టణ వాసుల భాగస్వామ్యం తప్పనిసరి అని పేర్కొన్నారు. హరితహారం లో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనానికి పాటుపడాలన్నారు. జగిత్యాల పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం పెరిగిందన్నారు. ఆ ప్లాస్టిక్‌ను మురుగు కాల్వల్లో, రహదారులపై పడేయడంతో.. వాటిని తిని మూగజీవాలు అనారోగ్యానికి గురవుతున్నాయని తెలిపారు. డ్రైనేజీతో కలుషితమవుతున్న మోతె చెరువును ఎమ్మెల్యే పరిశీలించారు. మోతె చెరువును మురుగు రహితంగా మార్చాలని, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ కొలగాని ప్రేమలత సత్యం, పట్టణ పార్టీ అధ్యక్షుడు గట్టు సతీష్, కమిషనర్ మారుతి ప్రసాద్, ఎమ్మార్వో వెంకటేష్, కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణ ప్రగతిని సమీక్షించిన శ్రీ పియూష్ గోయల్

న్యూఢిల్లీ, జులై 3:దేశంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి పిఎంజి ఫెసిలిటేషన్ కింద చేపట్టిన ముఖ్యమైన ప్రాజెక్టుల నిర్మాణ ప్రగతిని కేంద్ర వాణిజ్య, పరిశ్రమ, రైల్వే మరియు వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ మంత్రి శ్రీ పియూష్ గోయల్ సమీక్షించారు.జూన్ 29వ తేదీన ప్రాజెక్టుల నిర్మాణాన్ని పర్యవేక్షించడానికి ఏర్పాటైన బృందం మంత్రి అధ్యక్షతన సమావేశం అయ్యింది. దేశంలో మౌలిక సౌకర్యాలు కల్పనకు చేపట్టిన 20 భారీ ప్రాజెక్టుల తాజా పరిస్థితిని మంత్రి అధికారులతో సమీక్షించి వీటిని పూర్తి చేయడానికి తగిన చర్యలను తీసుకోవలసిన చర్యలను సమావేశంలో చర్చించారు.

దాదాపు 2.7 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడి అంచనాలతో చేపట్టిన 20 భారీ ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి 59 అంశాలపై మంత్రి అధికారులతో సమీక్షించారు.

వీటిలో ప్రధానమంత్రి గతంలో సమీక్షించిన ప్రగతి పథకాలు కూడా ఉన్నాయి.

దేశంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి పిఎంజి ఫెసిలిటేషన్ కింద చేపట్టిన ముఖ్యమైన ప్రాజెక్టుల నిర్మాణ ప్రగతిని కేంద్ర వాణిజ్య, పరిశ్రమ, రైల్వే మరియు వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ మంత్రి శ్రీ పియూష్ గోయల్ సమీక్షించారు. జూన్ 29వ తేదీన ప్రాజెక్టుల నిర్మాణాన్ని పర్యవేక్షించడానికి ఏర్పాటైన బృందం మంత్రి అధ్యక్షతన సమావేశం అయ్యింది. దేశంలో మౌలిక సౌకర్యాలు కల్పనకు చేపట్టిన 20 భారీ ప్రాజెక్టుల తాజా పరిస్థితిని మంత్రి అధికారులతో సమీక్షించి వీటిని పూర్తి చేయడానికి తగిన చర్యలను తీసుకోవలసిన చర్యలను సమావేశంలో చర్చించారు.

దాదాపు 2.7 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడి అంచనాలతో చేపట్టిన 20 భారీ ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి 59 అంశాలపై మంత్రి అధికారులతో సమీక్షించారు. వీటిలో ప్రధానమంత్రి గతంలో సమీక్షించిన ప్రగతి పథకాలు కూడా ఉన్నాయి.

మంత్రి సమీక్షించిన ప్రాజెక్టులలో కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టుల వివరాలు :

ప్రాజెక్టుల నిర్మాణ ప్రగతిని సమీక్షించిన శ్రీ గోయల్ వీటిని సకాలంలో పూర్తి చేయడానికి, నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దేశంలో ఆర్థికాభివృద్ధి సాధనకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే అంశంలో కీలక పాత్ర పోషించే ప్రాజెక్టులపై తరచూ బహుళ-స్థాయి సమీక్ష నిర్వహించాలని మంత్రి సూచించారు.

గర్భాశయవ్యాధి నిర్ధారణ మరియు గర్భ సంచిని పరీక్షించే అంశాలకు చెందిన 17వ ప్రపంచ సదస్సు నుద్దేశించి ప్రసంగించిన - డాక్టర్ హర్ష వర్ధన్

న్యూఢిల్లీ, జులై 3:గర్భాశయ వ్యాధి నిర్ధారణ, గర్భ సంచిని పరీక్షించే అంశాలకు చెందిన 17వ ప్రపంచ సదస్సు ప్రారంభ సమావేశంలో, ప్రఖ్యాత వైద్యులు, వైద్య శాస్త్ర ప్రొఫెసర్లు, గర్భాశయ వ్యాధి నిర్ధారణ, గర్భ సంచిని పరీక్షించే నిపుణులతో కూడిన వైద్య బృందానికి చెందిన ప్రేక్షకులను ఉద్దేశించి, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ హర్ష వర్ధన్, గత రాత్రి, దృశ్య మాధ్యమం ద్వారా ప్రసంగించారు.

గర్భ సంచిని పరీక్షించడం, గర్భాశయ యొక్క ముందస్తు గాయాల చికిత్సలలో మార్గదర్శక శిక్షణ, మరియు ప్రతిష్ఠాత్మక ప్రపంచ కాంగ్రెస్ ను మొదటిసారి ఆసియాలో నిర్వహిస్తున్నందుకు, డాక్టర్ హర్ష వర్ధన్, ఇండియన్ సొసైటీ ఆఫ్ కాల్‌పోస్కోపీ మరియు సర్వైకల్ పాథాలజీ సంస్థను, అభినందించారు. "గర్భాశయ క్యాన్సర్‌ను తొలగించడం: కార్యాచరణకు పిలుపు" అనే ప్రపంచ కాంగ్రెస్ ఇతివృత్తం, "2030 నాటికి గర్భాశయ క్యాన్సర్ ను నిర్మూలించాలన్న" డబ్ల్యూ.హెచ్.ఓ. పిలుపుకు అనుగుణంగా ఉందని, ఆయన పేర్కొన్నారు.గర్భాశయ క్యాన్సర్ అనే అంశంపై కేంద్ర ఆరోగ్య మంత్రి మాట్లాడుతూ, "ఇది మహిళల్లో నాలుగో అత్యంత సాధారణ క్యాన్సర్. ఇది ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా అర మిలియన్లకు పైగా మహిళలను ప్రభావితం చేస్తోంది. అందులో పావు మిలియన్ మంది మృత్యువాత పడుతున్నారు. మహిళల ఆరోగ్యానికి ఒక పెద్ద ముప్పుగా మారిన, గర్భాశయ క్యాన్సర్ కారణంగా, ప్రతి రెండు నిమిషాలకు ఒక మహిళ మరణించడం విషాదకరం. విచారకరమైన విషయం ఏమిటంటే, ముందుగానే గుర్తించి, సమర్థవంతంగా చికిత్స అందించినప్పుడు, గర్భాశయ క్యాన్సర్ అనేది అత్యంత విజయవంతంగా చికిత్స చేయగల క్యాన్సర్ రూపాలలో ఒకటి, అని తెలిసినప్పటికీ, చాలా మంది మహిళలు, గర్భాశయ కాన్సర్ తో బాధపడుతూ, మృతి చెందుతున్నారు. చివరి దశలో నిర్ధారణ అయిన క్యాన్సర్లను కూడా, తగిన చికిత్స, ఉపశమన సంరక్షణ తో నియంత్రించవచ్చు. నివారించడానికి, పరీక్షించడానికి, చికిత్స చేయడానికి ఒక సమగ్ర విధానాన్ని పాటించడం ద్వారా, గర్భాశయ క్యాన్సర్ ను ఒక తరంలోనే సాధారణ ప్రజారోగ్య సమస్యగా తొలగించవచ్చు." అని వివరించారు.

2030 సంవత్సరానికి గర్భాశయ క్యాన్సర్ నివారించాలన్న డబ్ల్యూ.హెచ్.ఓ. లక్ష్యాన్ని సాధించడానికి భారతదేశం చేపట్టిన కీలక పాత్రను డాక్టర్ హర్ష వర్ధన్ ప్రత్యేకంగా వివరిస్తూ, "జాతీయ క్యాన్సర్ నియంత్రణ కార్యక్రమాన్ని రూపొందించిన కొన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలలో భారతదేశం ఒకటి అని నేను గర్వంగా చెప్పగలను. ఆసియా లో ఒక నాయకత్వ దేశంగా, 2016 సంవత్సరంలో, గొంతు, రొమ్ము, నోటి మరియు గర్భాశయ క్యాన్సర్ వంటి సాధారణ క్యాన్సర్ల ను పరీక్షించడానికి కార్యాచరణ మార్గదర్శకాలను ప్రారంభించాము. 90 శాతం హెచ్.పి.వి. టీకాలు వేయడం ద్వారా, 70 శాతం పరీక్షలు చేయడం ద్వారా, 90 శాతం గర్భాశయ పూర్వ క్యాన్సర్ మరియు క్యాన్సర్ కు చికిత్స ద్వారా, ఉపశమన సంరక్షణ చర్యలను అందుబాటులోకి తీసుకు రావడం ద్వారా, ఈ ప్రాణాంతకమైన కాన్సర్ ను తొలగించాలనే లక్ష్యాన్ని సాధించడానికి, భారతదేశంతో పాటు మరో 194 దేశాలు కలిసి పనిచేయాలని సంకల్పించాయి." అని చెప్పారు.

ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం యొక్క రెండు విభాగాల ద్వారా క్యాన్సర్‌ను అంతం చేయడానికి భారత ప్రభుత్వం ఎలా జోక్యం చేసుకుంటుందో కేంద్ర ఆరోగ్య మంత్రి తమ ప్రసంగంలో వివరిస్తూ, "సమర్థవంతమైన ప్రాథమిక హెచ్.పి.వి. టీకాల నిర్వహణతో పాటు ద్వితీయ నివారణ విధానాలు చాలా గర్భాశయ క్యాన్సర్ కేసులను నివారించగలవన్న విషయం మనందరికీ తెలుసు. నేడు, భారతదేశం అన్ని స్థాయిల్లో క్యాన్సర్ సంరక్షణను బలపరుస్తోంది. మన ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన ద్వారా, క్యాన్సర్ మరియు ముందస్తు గాయాల చికిత్స, ఆర్థికంగా వెనుకబడిన జనాభాకు అందుబాటులో ఉంది. మన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇప్పుడు సంరక్షణ కేంద్రాలు గా మార్చబడ్డాయి, ఇక్కడ భారీ స్థాయిలో పరీక్షలు నిర్వహించబడుతున్నాయి. వైద్యులు మరియు పారామెడికల్ సిబ్బందికి వారి నైపుణ్యాలను మరింత మెరుగుపరచడానికి, అలాగే, గ్రామీణ ప్రాంతాల నిరుపేద మహిళలకు నాణ్యమైన సంరక్షణను అందించడానికీ వీలుగా, ప్రతి ఏటా శిక్షణ ఇస్తున్నాము. గత ఏడేళ్ళలో, 29 కొత్త ఎయిమ్స్ సంస్థలు ప్రారంభించడంతో పాటు, మరో 25 ప్రాంతీయ క్యాన్సర్ కేంద్రాలను అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడం జరిగింది. మన మొత్తం 542 వైద్య కళాశాలలు, 64 పోస్ట్ గ్రాడ్యుయేట్ సంస్థలు, క్యాన్సర్ ప్రారంభ దశలో ఉన్న రోగులకు, అలాగే క్యాన్సర్ తో బాధపడుతున్న రోగులకు సమగ్ర సంరక్షణను అందిస్తున్నాయి. సంరక్షణలో నాణ్యతను జోడించడానికి, భారతదేశం గర్భాశయ కాన్సర్ చికిత్స (గైనో-ఆంకాలజీ) లో సూపర్ స్పెషాలిటీ కోర్సును ప్రవేశపెట్టింది." అని చెప్పారు.

ఈ సమావేశం యొక్క శాస్త్రీయ చర్చలు ఆసియా మరియు ఆసియా ఖండం వెలుపల ఉన్న ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలకు వ్యూహాలను రూపొందించడంలో సహాయపడతాయని పేర్కొంటూ, ఆయన తమ ప్రసంగాన్ని ముగించారు. ఐ.ఎఫ్.సి.పి.సి-2021 ప్రపంచ సదస్సు విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు.

రైతే కేంద్ర బిందువుగా రైతు వేదికలు : మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, జులై 3: : రైతే కేంద్ర బిందువులుగా రైతు వేదికలు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. నాల్గవ విడత పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రమైన సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలో శనివారం వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాన్ని, గ్రామ పంచాయతీ నర్సరీని మంత్రి ప్రారంభించారు. అంతకుముందు హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. సెగ్రీగేషన్ షెడ్డులో సేంద్రీయ ఎరువుల తయారీ విధానం, నర్సరీలో మొక్కల పెంపకం తీరును పరిశీలించారు. అనంతరం పొన్నాల గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ లో స్టీల్ బ్యాంకును ప్రారంభించారు. ఓపెన్ జిమ్, స్మశాన వాటిక, రైతు వేదికను మంత్రి ప్రారంభించి మాట్లాడారు.

పొన్నాల వైపు సిద్దిపేట పట్టణీకరణ..

సిద్ధిపేట పట్టణీకరణ భవిష్యత్ పొన్నాల వైపు ఉన్నదని, కొత్త కలెక్టరేట్, రైల్వే లైను మీదుగా పోవడంతో శరవేగంగా పొన్నాల పట్టణాభివృద్ధి జరుగుతున్నదని మంత్రి చెప్పారు. పొన్నాల టూ గుడికందుల వరకు పొన్నాల రాజీవ్ రహదారి మీదుగా కిష్టసాగర్, ఏన్సాన్ పల్లి, వెంకటాపూర్, బుస్సాపూర్ మీదుగా గుడికందుల వరకూ డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ. 14.16 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు.

వ్యవసాయశాఖ, రైతుబంధు సమితి నాయకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రైతు వేదికలలో కూర్చుని ఆయిల్ ఫామ్, వరి వెదజల్లే పద్ధతి, విత్తనోత్పత్తి- విత్తన సాగు సీడ్‌లపై అవగాహన కల్పిస్తూ రైతులకు మేలు జరిగేలా శిక్షణ కార్యక్రమాలు చేపట్టి రైతులను ప్రోత్సహించాలన్నారు. ఆయిల్ ఫామ్ తోటలు పెంపునకు రైతులు ముందుకు రావాలని కోరారు. పొన్నాలలో ప్లాస్టిక్ నివారణ జరిపేందుకే స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్లాస్టిక్ నివారణ అమలయ్యేలా చూడాలని స్థానిక ప్రజాప్రతినిధులకు మంత్రి సూచించారు.

ఈనెలలోనే 1,328 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

అమరావతి, జులై 3:ఏపీలో ఉద్యోగాల భర్తీపై గత నెలలో సీఎం జగన్ రెండు సంచలన నిర్ణయాలు తీసుకున్న విషయం తెలిసిందే. అందులో మొదటిది జ్యాబ్ క్యాలెండర్ విడుదల కాగా.. రెండోది ఏపీపీఎస్సీ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఇంటర్వ్యూలను రద్దు చేయడం. రాష్ట్రంలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న మొత్తం 10,143 పోస్టులను భర్తీ చేయనున్నట్లు జాబ్ క్యాలెండర్ లో అధికారులు పేర్కొన్నారు.

అయితే.. ఈ జాబ్ క్యాలెండర్ ప్రకారం ఈ జూలై నెలలో మొత్తం 1238 ఎస్సీ, ఎస్టీ, డీఏ బ్యాక్ లాగ్ ఉద్యోగాలను ఈ నెలలో భర్తీ చేయాల్సి ఉంది. ఇప్పటికే ప్రభుత్వం అనుమతులిచ్చిన 802 పోస్టుల్లో 432 ఎస్సీ, 370 ఎస్టీలకు సంబంధించినవి ఉన్నాయి.

ఈ ఉద్యోగాలకు ఈ నెలలోనే నోటిఫికేషన్ విడుదల చేయాలని సర్కార్ ఉత్తర్వులిచ్చింది.

ఈ మేరకు ఈ నెల 2వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్హతల్లో అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక నిర్వహించాలని ప్రభుత్వం తెలిపింది. అయితే.. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ంఖఖూఅ) ద్వారా భర్తీ చేసే పోస్టులకు మాత్రం ఈ విధానం వర్తించదని ప్రభుత్వం తెలిపింది. కాగా జాబ్ క్యాలెండర్ ప్రకారం ప్రతి నెలలో ఉద్యోగ ప్రకటనలు విడుదల చేస్తామని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది.

జగన్ కేసుల్లో నిందితులకు హైకోర్టు షాక్

అమరావతి, జులై 3:ఏపీ సీఎం జగన్‌పై దాఖలైన అక్రమాస్తుల కేసుల్లో నిందితులుగా ఉన్న వారికి తెలంగాణ హైకోర్టు తాజాగా షాకిచ్చింది. సీబీఐ దాఖలు చేసిన వేర్వేరు ఛార్జిషీట్లలో నిందితులుగా ఉన్న వారిలో ఒకటి కంటే ఎక్కువ కేసుల్లో ఉన్న వారు చాలా మంది ఉన్నారు. దీంతో వీరంతా ఒక్కో కేసులో గతంలో హైకోర్టు, సుప్రీంకోర్టులు ఇచ్చిన ఆదేశాల ఆధారంగా తమకు విముక్తి కల్పించాలని వేడుకుంటున్నారు. దీంతో అలా కుదరదని హైకోర్టు స్పష్టం చేసింది. నిందితులు దాఖలు చేసిన విముక్తి పిటిషన్లపై సీబీఐ దాఖలు చేసిన కేసుల ఆధారంగానే విచారణ చేపట్టాలని నిర్ణయించింది. దీంతో వీరంతా ప్రతీ కేసులోనూ తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుంది.

జగన్ అక్రమాస్తుల కేసులో సీబీఐ నమోదు చేసిన ఛార్జిషీట్లలో జగన్‌తో పాటు దాదాపు 100 మందికి పైగా సహ నిందితులు ఉన్నారు. వీరంతా కొన్నళ్లుగా తమపై సీబీఐ కోర్టు విచారణను నిలిపేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయిస్తూ వస్తున్నారు. ఇందులో కొందరికి విముక్తి కూడా లభించింది. గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టులు ఇచ్చిన తీర్పుల్ని ప్రస్తావిస్తూ వీరంతా ఊరట పొందుతున్నారు. దీంతో మిగిలిన నిందితులు కూడా తమకు కూడా వారి తరహాలోనే విముక్తి కల్పించాలని హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. వారికి వర్తింపచేసిన తీర్పులనే తమకూ వర్తింపచేయాలని హైకోర్టును కోరుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది.

జనం సొమ్మును కత్తి మహేష్‌కు ఎలా ఇస్తారు?

హైదరాబాద్ , జులై 3:నెల్లూరులో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చెన్నై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సినీ విశ్లేషకుడు కత్తి మహేష్ ట్రీట్మెంట్ ఖర్చుల కోసం జగన్ ప్రభుత్వం రూ. 17 లక్షల భారీ ఆర్థిక సాయం విడుదల చేసింది. సీఎం సహాయ నిధి నుంచి ఈ నగదును అందిస్తూ.. అధికారికంగా సీఎం క్యాంప్ ఆఫీస్ నుంచి శుక్రవారం లేఖ విడుదల చేశారు.

కత్తి మహేష్ చికిత్సకు అయ్యే ఖర్చును భరిస్తామని ముఖ్యమంత్రి ప్రత్యేకాధికారి డాక్టర్ ఎం హరికృష్ణ లెటర్ ద్వారా తెలియజేశారు. అయితే కత్తి మహేష్‌కి జగన్ ప్రభుత్వం భారీ ఆర్థిక సాయం అందించడంతో సోషల్ మీడియాలో విమర్శలు వెల్తువెత్తాయి. అసలు కత్తి మహేష్‌కి ఏ లెక్కన అంత భారీ మొత్తంలో ఆర్థిక సాయం ప్రకటించారని.. సాధారణ ప్రజలకు ఇలాంటి ప్రమాదాలు సంభవించినప్పుడు ఇలాగే స్పందిస్తున్నారా? కత్తి మహేష్ విషయంలో ఇంత చొరవ తీసుకోవాల్సిన అవసరం ఏంటని ప్రశ్నలు సంధిస్తున్నారు. ఏపీ సీఎం జగన్ సాయం చేయాలనుకుంటే తన సొంత డబ్బులు ఇవ్వాలని లేదంటే వైఎస్ఆర్ ట్రస్ట్ నుంచి అయినా మంజూరు చేయాలి తప్ప ప్రజల డబ్బును కత్తి మహేష్‌కు పంచడం కరెక్ట్ కాదని నిలదీస్తూ సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెడుతున్నారు.

ఏపీలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాల కష్టాలు.. ఢిల్లీలో మకాం వేసిన మంత్రి..?

హైదరాబాద్ , జులై 3:నెల ప్రారంభమై ఇప్పటికే మూడు రోజులైనా ఏపీలో ఇంకా ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు అందలేదు. ప్రతి నెలా ఇదే తంతు నెలకొంటోంది. అయితే ఈసారి జీతాలకు డబ్బులు అడ్జెస్ట్ చేసేందుకు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తీవ్రంగా శ్రమిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన కేంద్ర మంత్రులను కలుస్తూ రుణం పొందేలా అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఆర్‌బీఐ దగ్గర ప్రభుత్వం తనకున్న మార్గాలను అన్నింటిని ఇప్పటికే వినియోగించుకుంది. కొత్తగా అప్పులు చేసేందుకు కేంద్రం నిరాకరించిందన్న వార్తలొస్తున్నాయి. ప్రతి మంగళవారం ఆర్బీఐ ప్రభుత్వ బాండ్ల వేలం వేస్తుంది. అలా రూ.2వేల కోట్లు వచ్చే అవకాశం ఉంటుంది. కానీ ప్రతి నెల ఏపీ సర్కార్ ఈ ఆప్షన్ వాడుకుంటుండటంతో ఈ నెల ఆ అవకాశం కూడా దక్కేలా లేదని తెలుస్తోంది.

ఏపీలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు అందించడానికి ఆర్థిక మంత్రి బుగ్గన ఎలాగైనా అప్పు పుట్టేలా అన్ని దారులు వెతుకుతున్నట్లు తెలుస్తోంది. నెలాఖరు వచ్చిందంటే అప్పు కోసం ఆర్థిక మంత్రి బుగ్గన ఢిల్లీ వస్తారన్న ప్రచారం ఉంది. కానీ ఈసారి ఆ అప్పు కూడా పుట్టేలా లేకపోవటం? బయటి నుండి అప్పులు వచ్చేలా లేకపోవటంతో జగన్ సర్కార్ ఏం చేస్తుందన్న ఆందోళన ఉద్యోగుల్లో నెలకొంది.

ప్రయాణికులకు గుడ్ న్యూస్.. దేశంలో అందుబాటులోకి మరిన్ని రైళ్లు

హైదరాబాద్ , జులై 3:కరోనా సెకండ్ వేవ్ కారణంగా దేశంలో పెద్ద ఎత్తున రైళ్లు నిలిచిపోయాయి. ప్రస్తుతం కరోనా కేసులు తగ్గుముఖం పట్టడంతో రైల్వేశాఖ ఇప్పటికే పలుమార్గాల్లో ప్యాసింజర్ రైళ్లతో పాటు ఎక్స్‌ప్రెస్ రైళ్లను పట్టాలెక్కించింది. తాజాగా మరోసారి పలు రూట్లలో పెద్ద ఎత్తున రైళ్లను అందుబాటులోకి తీసుకురానుంది. ఇందులో గరీబ్ రథ్ స్పెషల్ తాజ్ ఎక్స్‌ప్రెస్, షాన్-ఎ-పంజాబ్, ముంబై సెంట్రల్-హజ్రత్ నిజాముద్దీన్ ఆగస్ట్ క్రాంతి రాజధాని ఎక్స్‌ప్రెస్‌తో సహా 50కిపైగా రైళ్లను తిరిగి ప్రారంభిస్తోంది. ప్రజలకు ప్రయాణం మళ్లీ చౌకగా, సురక్షితంగా, సౌకర్యంగా ఉంటుందని రైల్వేశాఖ మంత్రి పీయూల్ గోయల్ వెల్లడించారు.

షాజహాన్‌పూర్-సీతాపూర్ సిటీ, సీతాపూర్ సిటీ- షాజహాన్‌పూర్ రిజర్వుడ్ ఎక్స్‌ప్రెస్ స్పెషల్ రైళ్లు నేటి నుంచి అందుబాటులోకి రానున్నాయి. లక్నో-వారణాసి ఇంటర్‌సిటీ స్పెషల్ (04270), వారణాసి-లక్నో ఇంటర్‌సిటీ స్పెషల్ (04269) సోమవారం నుంచి పట్టాలెక్కనున్నాయి. వారణాసి ?ఆనంద్ విహార్ (04249) ఈ నెల 8 నుంచి, ఆనంద్ విహార్ ?వారణాసి (04250), గరీబ్ రథ్ స్పెషల్ రైళ్లు ఈ నెల 8వ తేదీ నుంచి అంద

కోవిడ్-19 వ్యాక్సిన్ తో గర్భిణీ మహిళలు, శిశువులకు రక్షణ కల్పించవచ్చు : డాక్టర్ ఎన్.కె.అరోరా

న్యూఢిల్లీ, జులై 3:ఆరోగ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం జారీ చేసిన గర్భిణులకు వ్యాక్సినేషన్ మార్గదర్శకాల గురించి ఇమ్యునైజేషన్ నేషనల్ టెక్నికల్ సలహా బృందం (ఎన్ టిఏజిఐ) కోవిడ్-19 వర్కింగ్ గ్రూప్ చైర్ పర్సన్ డాక్టర్ ఎన్.కె.అరోరా డిడి న్యూస్ తో మాట్లాడారు.

కోవిడ్-19 రెండో విడత కాలంలో గర్భిణీల్లో మరణాల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు డాక్టర్ ఎన్.కె.అరోరా తెలిపారు. "కోవిడ్-19 మహమ్మారి రెండో విడత విజృంభణ సమయంలో ఆ వ్యాధి సోకిన గర్భిణీ మహిళల మరణాల సంఖ్య తొలి విడతతో పోల్చితే రెండు నుంచి మూడు రెట్లు పెరిగినట్టు తేలింది. ఈ నేపథ్యంలో గర్భిణీ మహిళలను కూడా కోవిడ్-19 వ్యాక్సిన్ల లబ్ధిదారులుగా చేర్చడం అవసరం అని భావించారు. గర్భిణీ మహిళల విషయంలో ఆమె, ఆమె గర్భంలోని శిశువు ఇద్దరి రక్షణ ముడిపడి ఉన్నాయి. ఈ కారణంగానే గర్భిణీ మహిళలకు కూడా వ్యాక్సిన్ వేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది" అని చెప్పారు.

ఈ వ్యాక్సిన్ తల్లులకు ఎంతో ప్రయోజనకరం, కరోనా వైరస్ కు సంబంధించిన భయం, ఆందోళన నుంచి వారు విముక్తులవుతారు అని ఆయన చెప్పారు. "గర్భిణీ మహిళకు వ్యాక్సినేషన్ ఇప్పించడం ద్వారా ఆమె గర్భంలో పెరుగుతున్న శిశువుని కూడా కాపాడవచ్చు. తల్లిలో వ్యాధి నిరోధకత పెరిగితే అది పిండానికి కూడా బదిలీ అవుతుంది. తల్లి శరీరంలో వ్యాక్సిన్ వల్ల ఏర్పడే ప్రభావం, వ్యాధి నిరోధకత కనీసం జనన సమయం వరకు శిశువుకి కూడా లభిస్తుంది" అని ఆయన వివరించారు.

గర్భిణీ మహిళకు వ్యాక్సిన్ వల్ల కలిగే రక్షణ

వ్యాక్సిన్లు గర్భిణీ మహిళకు ఎంత వరకు సురక్షితం అన్న ప్రశ్నకు సమాధానం ఇస్తూ వ్యాక్సిన్ తల్లి శరీరానికే కాకుండా శిశువుకి కూడా రోగనిరోధకత కల్పిస్తుంది గనుక తల్లులకు వ్యాక్సిన్ ఇవ్వాలని ఇప్పుడు ప్రపంచం అంతా ఆలోచిస్తోంది. "స్థూలంగా మన వ్యాక్సిన్లు భద్రమైనవని తేలింది. చివరికి ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్లు అధికంగా ఇస్తున్న యూరప్, ఉత్తర అమెరికా వంటి పాశ్చాత్య దేశాల్లో కూడా గర్భిణీ మహిళలకు వ్యాక్సిన్ ఇస్తున్నారు. ఈ వాస్తవాలను, గణాంకాలను పరిశీలించిన అనంతరం మన దేశంలో కూడా గర్భిణీ మహిళలకు వ్యాక్సిన్ ఇవ్వాలన్న నిర్ణయం తీసుకున్నారు" అని తెలిపారు.

గర్భం దాల్చిన ప్రారంభ సమయంలో గర్భంలోని శిశువు అవయవాలు అభివృద్ధి చెందుతూ ఉంటాయి గనుక గర్భిణీ మహిళలకు తొలి మూడు మాసాల కాలంలో వ్యాక్సినేషన్ చేయడంపై కొందరు అనుమానాలు, భయాలు వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ అరోరా ఈ అనుమానాలను నివృత్తి చేస్తూ వ్యాక్సిన్ ఇటు తల్లికి, అటు ఆమె గర్భంలోని శిశువుకి కూడా క్షేమమేనని హామీ ఇచ్చారు. "ఆ భయాలను నేను తోసి వేస్తున్నాను. మన వ్యాక్సిన్లలో ఇన్ఫెక్షన్ కు కారణమయ్యే సజీవ వైరస్ ఉండదని నేను హామీ ఇస్తున్నాను. వ్యాక్సిన్ తల్లి శరీరంలో ఎదుగుతున్న శిశువుపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపదు" అని ఆయన భరోసా ఇచ్చారు.

వ్యాక్సిన్లు వేయించుకున్న గర్భిణీ మహిళల భద్రతను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉంటాం అని ఆయన చెప్పారు. "వ్యాక్సిన్ వేయించుకున్న గర్భిణీ మహిళలు ఏదైనా ఆసౌకర్యానికి గురవుతున్నారా అనేది తెలుసుకునేందుకు దేశంలోని ఆరోగ్య శాఖ నెట్ వర్క్ వారిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఉంటుంది. అలాగే శిశువు ఎదుగుదల తీరు ఎలా ఉందో కూడా పర్యవేక్షిస్తారు. వ్యాక్సిన్ వేయించుకున్న అనంతరం మన తల్లులు, సోదరీమణులు, కుమార్తెలు పూర్తిగా క్షేమం అని నిర్ధారించుకోవడమే దీని లక్ష్యం" అని వివరించారు.

గర్భిణీ మహిళలపై వ్యాక్సినేషన్ అనంతరం ఏర్పడే దుష్ప్రభావాల గురించి మాట్లాడుతూ "10 లక్షల మందిలో ఒక్క మహిళకు మాత్రమే బ్లీడింగ్ కావడం లేదా క్లాట్లు ఏర్పడడం వంటి లక్షణాలు కనిపించాయి. అలాంటి వారిలో తీవ్రమైన తలనొప్పి, వాంతులతో కూడిన తలనొప్పి, వాంతులతో కూడిన కడుపునొప్పి లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు ఏర్పడ్డాయి. వ్యాక్సిన్ వేయించుకున్న రోజు నుంచి మూడు లేదా నాలుగు వారాల వరకు ఈ మూడు లేదా నాలుగు లక్షణాలు కనిపించడం సాధారణమే. ఇలాంటి లక్షణాలు కనిపించగానే కుటుంబ సభ్యులు ఆ గర్భిణీ మహిళను సత్వరం వ్యాక్సినేషన్ వేసిన ఆస్పత్రికి తీసుకెళ్లాలి. ఆ రుగ్మతకు కారణం ఏమిటన్నది ఆస్పత్రిలో శోధించి అవసరమైన చికిత్స అందిస్తారు" అన్నారు.

ఏ సమయంలో అయినా గర్భిణీ మహిళలు వ్యాక్సిన్ తీసుకోవచ్చునని చైర్ పర్సన్ తెలిపారు. తాజాగా తీసుకున్న నిర్ణయం ప్రకారం "గర్భం దాల్చినట్టు గుర్తించిన క్షణం నుంచి ఏ సమయంలో అయినా గర్భిణీ మహిళకు వ్యాక్సిన్ వేయవచ్చు. గర్భధారణ తర్వాత తొలి, ద్వితీయ, తృతీయ త్రైమాసికంలో ఎప్పుడు వ్యాక్సిన్ వేయొచ్చు అన్నది సమస్యే కాదు" అన్నారు.

తిరుమలలో జూలై 6న రావణ సంహారం సర్గల పారాయణం

తిరుమల,జూలై 3:కరోనా వైరస్ నుంచి ప్రపంచానికి విముక్తి కల్పించాలని శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని వసంత మండపంలో రామాయణంలోని యుద్ధకాండ పారాయణంలో భాగంగా జూలై 6వ తేదీన రావణ సంహారం సర్గల పారాయణం చేయనున్నట్లు టిటిడి అదనపు ఈవో ఏ.వి.ధర్మరెడ్డి తెలిపారు. తిరుమలలోని వసంత మండపంలో శనివారం ఆయన అధికారులు,పండితులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ వసంత మండపంలో జూన్ 11న ప్రారంభమైన రామాయణంలోని యుద్ధకాండ పారాయణంకు ప్రపంచ వ్యాప్తంగా భక్తుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. ఇందులో భాగంగా జూలై 6న రావణ సంహారం సర్గల పారాయణం సందర్భంగా వసంత మండపంలో అశోకవనాన్ని తలపించే సెట్టింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. యుద్ధకాండ 109 నుంచి 114 వరకు ఉన్న 270 శ్లోకాలను పారాయణం చేస్తారని చెప్పారు. ఇందులో 111వ సర్గ 14వ శ్లోకంలో శ్రీ రామచంద్రమూర్తి రావణునిపై బాణం ఎక్కు పెట్టడంతో ప్రారంభమై, 19వ శ్లోకంలో వధించడంతో పూర్తవుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక హారతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు.

సాధారణ కార్యకర్తను సీఎంను చేశారు: పుష్కర్‌సింగ్ ధామి

డెహ్రాడూన్, జులై 3:: భారతీయ జనతాపార్టీ ఒక సాధారణ కార్యకర్తకు ముఖ్యమంత్రి పీఠం కట్టబెట్టిందని ఉత్తరాఖండ్ నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టబోతున్న పుష్కర్‌సింగ్ ధామి అన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వంలో అందరం కలిసికట్టుగా పనిచేస్తామని ఆయన చెప్పారు. నాకు ముఖ్యమంత్రిగా పనిచేసేందుకు నిండా ఏడాది కూడా సమయం లేదని, ఇంత తక్కువ కాలంలోనే ఇతర నాయకుల సాయంతో ప్రజలకు సేవ చేయడం సవాలు లాంటిదని, ఆ సవాలును తాను స్వీకరిస్తున్నానని ధామి వ్యాఖ్యానించారు.

కాగా, పుష్కర్ సింగ్ ధామి పిథోగఢ్‌లో జన్మించారు. ఆ తర్వాత రాజకీయ రంగప్రవేశం చేసి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఉద్ధమ్‌సింగ్ నగర్ జిల్లాలోని ఖతిమా అసెంబ్లీ నియోజకవర్గానికి ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అంతకుముందు ధామి ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి కోశ్యారీ దగ్గర ఓఎస్‌డీగా పనిచేశారు. కాగా, ఈ మధ్యాహ్నం 3 గంటలకు ఉత్తరాఖండ్‌లోని బీజేపీ హెడ్ క్వార్టర్స్‌లో బీజేఎల్పీ సమావేశంలో జరిగింది. ఆ సమావేశంలో ఎమ్మెల్యేలంతా కలిసి ప్రకాష్‌సింగ్ ధామిని తమ నాయకుడిగా ఎన్నుకున్నారు.

నల్లగొండ జిల్లాలో ఘనంగా చకిలం 25వ వర్ధంతి

నల్లగొండ, జులై 3:: జిల్లాపై దివంగత నేత చకిలం శ్రీనివాసరావు చెరగని ముద్రే వేసుకున్నారని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారికి అప్పట్లో చకిలం ఇల్లే శాశ్వత చిరునామాగా ఉండేదన్నారు. అటువంటి ముద్ర వేసుకోవడం అరుదైనదని, ఆ అదృష్టం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఒక్క చకిలం శ్రీనివాసరావుకు మాత్రమే దక్కిందని మంత్రి చెప్పారు.

నల్లగొండ జిల్లా కేంద్రంలో శనివారం మధ్యాహ్నం జరిగిన దివంగత కాంగ్రెస్ నేత చకిలం శ్రీనివాసరావు 25వ వర్ధంతి సభకు మంత్రి జగదీశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని రామగిరిలో చకిలం శ్రీనివాసరావు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం చకిలం తనయుడు టీఆర్ఎస్ రాష్ట్ర నేత చకిలం అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ.. నాడు కాంగ్రెస్ క్యాడర్‌కు ఆపద వస్తే మొదట గుర్తుకు వచ్చేది చకిలం శ్రీనివాసరావు ఇల్లే అని గుర్తు చేశారు. నమ్ముకున్న క్యాడర్ కోసం ఎంత దూరమైన వచ్చేవారన్న పేరు శ్రీనివాస్ రావుకు ఉందన్నారు. తనకు అవకాశం కలిగిన ప్రతిసారి నమ్ముకున్న వారికి సముచిత స్థానం ఇచ్చేవారు అని మంత్రి జగదీశ్ రెడ్డి గుర్తు చేశారు.

వరుసగా పది నెలలపాటు అత్యధిక వస్తు రవాణా రికార్డు సృష్టించిన భారతీయ రైల్వేలు

న్యూఢిల్లీ, జులై 3:న్యూఢిల్లీ, జులై 3:ఒక వైపు కోవిడ్ మహమ్మారి సమస్య, సవాళ్లు వున్నప్పటికీ వాటిని అధిగమిస్తూ జూన్ 2021లో భారతీయ రైల్వేలు రికార్డు స్థాయిలో ఆదాయం సంపాదించాయి.

యుద్ధ ప్రాతిపదికన పని చేసిన భారతీయ రైల్వేలు..జూన్ 2021లో 112. 65 మిలియన్ టన్నుల వస్తు రవాణా చేశాయి. జూన్ 2019తో పోలిస్తే (101.31 టన్నులు) ఇది 11.19 శాతం అంధికం. జూన్ 2020తో పోలిస్తే (93.59 మిలియన్ టన్నులు) ఇది 20.37 శాతం అధికం.

జూన్ 2021లో భారతీయ రైల్వేలు రవాణా చేసిన వస్తువుల వివరాలు ఇలా వున్నాయి. 50. 03 మిలియన్ టన్నుల బొగ్గు, 14.53 మిలియన్ టన్నుల ముడి ఇనుము, 5.53 మిలియన్ టన్నుల పిగ్ ఐరన్, ఉక్కు, 5.53 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలు, 4.71 మిలియన్ టన్నుల ఎరువులు, 3.66 మిలియన్ టన్నుల మినరల్ ఆయిల్, 6.59 మిలియన్ టన్నుల సిమెంట్, 4.28 మిలియన్ టన్నుల క్లింకర్‌ను సరఫరా చేయడం జరిగింది. భారతీయ రైల్వేలు జూన్ 2021 నెలలో వస్తు రవాణా ద్వారా రూ. 11186.81 కోట్లు ఆర్జించాయి. జూన్ 2020తో పోలిస్తే (రూ.8829.68 కోట్లు) ఇది 26.7 శాతం అధికం. జూన్ 2019తో పోలిస్తే (రూ.10707.53 కోట్లు) ఇది 4.48 శాతం అధికం.

వస్తు రవాణ వ్యవస్థను అందరికీ అందుబాటులోకి తేవడానికిగాను భారతీయ రైల్వేలు అనేక రాయితీలను, డిస్కౌంట్లను ఇవ్వడం జరుగుతోంది. ప్రస్తుతమున్న నెట్ వర్క్ ద్వారా వస్తు రవాణా రైళ్ల వేగాన్ని కూడా పెంచడం జరిగింది. తద్వారా ఈ రంగానికి సంబంధించి భాగస్వామ్యమున్న పలువురికి ఖర్చులు తగ్గాయి. గత 19 నెలల్లో వస్తు రవాణా వేగం రెట్టింపు అయ్యింది. కోవిడ్ 19 మహమ్మారి సమయాన్ని అవకాశంగా మార్చుకున్న భారతీయ రైల్వేలు ప్రతి అంశంలోను తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకున్నాయి.

డబుల్ బెడ్‌రూం ఇండ్లకు మంత్రి నిరంజన్‌రెడ్డి శంకుస్థాపన

మహబూబ్‌నగర్, జులై 3:: జిల్లాలోని మూసాపేట మండలం మహ్మద్ హుస్సేన్‌పల్లి గ్రామంలో రూ. కోటి 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న 25 డబుల్ బెడ్‌రూం ఇండ్లకు మంత్రి నిరంజన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా మంత్రి శనివారం హుస్సేన్‌పల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న భూగర్భ మురుగు కాల్వలకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పల్లె ప్రకృతి వనాన్ని, వైకుంఠధామాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పల్లె ప్రగతి తర్వాత ఊర్లు అద్దంలా మెరవాలన్నారు. ప్రతి గ్రామానికి పల్లె ప్రకృతివనం, వైకుంఠధామం,సెగ్రిగేషన్ షెడ్, నర్సరీ, ట్రాక్టర్, ట్రాలీ ఇచ్చాం. ఐదేళ్లలో ప్రతి గ్రామం అద్దంలా మెరవాలని చెప్పారు. గ్రామానికి మరో 25 డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గ్రామానికి మండల కేంద్రంతో కలిపే విధంగా బీటీ రహదారికి ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. తన ఎమ్మెల్యే నిధుల నుండి 10 లక్షల రూపాయలు యాదవ కమ్యూనిటీ, దళిత కమ్యూనిటి భవనాలకి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా కలెక్టర్ నిధుల నుండి మరో రూ. 5 లక్షలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నెలరోజుల్లో గ్రామంలోని మహిళలకు 20 కుట్టుమిషన్లు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటరావు, దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, ఆర్‌డీవో పద్మ, డీపీవో వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారిని సుచరిత, ట్రాన్స్కో ఎస్‌ఈ మూర్తి, జెడ్పీటీసీ ఇంద్రయ్య సాగర్, ఎంపీపీ కళావతి, ప్రత్యేకాధికారి రాధ రోహిణి, తహసీల్దార్ మంజుల, ఎంపీడీవో ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతే లక్ష్యంగా పల్లె, పట్టణ ప్రగతి: మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్, జులై 3:: పచ్చదనం, పరిశుభ్రతే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా శనివారం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి నిర్మల్ పట్టణంలోని కబుతర్ కమాన్, రాం రావుబాగ్‌లో పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, పారిశుద్ధ్యం, విద్యుత్ సమస్యలు, మంచినీటి సరఫరా ఎలా ఉందని, ప్రతి నెల ఫించన్లు అందుతున్నాయా అని ఆరా తీశారు.

తమ ఇంటికి నల్లా కనెక్షన్ ఇవ్వడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఓ మహిళ.. మంత్రి దృష్టికి తెచ్చారు. నల్లా కనెక్షన్ ఇవ్వకపోవడంపై అక్కడే ఉన్న అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నల్లా కనెక్షన్ ఇవ్వాలని ఆదేశించారు. పట్టణ ప్రగతిలో చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలని, లేకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రామాలు, పట్టణాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి ప్రతీ నెల నిధులు కేటాయిస్తున్నారని, దీంతో పల్లెలు, పట్టణాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయన్నారు. గతంలో ఎవ్వరూ కూడా ఇలా నిధులు మంజూరు చేయలేదని స్పష్టం చేశారు. పర్యావరణం, పారిశుద్ధ్యం, పచ్చదనంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలన్న ఉద్దేశంతో పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో భాగంగా గ్రామాలు, కాలనీలో పరిసరాలు శుభ్రంగా ఉంచేందుకు, తాగునీరు, రహదారులు, తదితర మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లా నీళ్ళు ఇస్తున్నామని, సురక్షితమైన ఈ నీటినే అందరూ త్రాగాలని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సూచించారు.

ఎఫ్‌బీ, గూగుల్, ఇన్‌స్టాపై కేంద్ర మంత్రి ప్రశంసలు..

న్యూఢిల్లీ, జులై 3:ఫేస్‌బుక్, గూగుల్, ఇన్‌స్టాగ్రామ్‌పై కేంద్ర ఐటీశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఇవాళ ప్రశంసలు కురిపించారు. దిగ్గజ సంస్థలు తమ ప్లాట్‌ఫామ్‌లో ఉన్న అనుచిత పోస్టులను తొలగించడాన్ని ఆయన స్వాగతించారు. కొత్త ఐటీ రూల్స్‌ను ఆ సంస్థలు అమలు చేయడం శుభపరిణామం అన్నారు. తన ట్విట్టర్ అకౌంట్ ద్వారా ఆయన ఈ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఇది పారదర్శకతకు భారీ ఊతంగా నిలుస్తుందని మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. ఫేస్‌బుక్ తన ప్లాట్‌ఫామ్ నుంచి సుమారు 30 మిలియన్ల పోస్టులను డిలీట్ చేసింది. ఫోటో షేరింగ్ యాప్ ఇన్‌స్టాగ్రామ్ కూడా రెండు మిలియన్లు పోస్టులను డిలీట్ చేసింది. కొత్త ఐటీ రూల్స్‌కు లోబడి.. గూగుల్ కూడా 59,350 లింకులను తొలగించింది. దాంట్లో యూట్యూబ్ కూడా ఉంది. స్వదేశీయంగా డెవలప్ చేసిన సోషల్ మీడియా యాప్ 'కూ' కూడా 1253 పోస్టులను తొలగించింది. అయితే కేంద్ర మంత్రి రవిశంకర్ తన ట్వీట్‌లో ట్విట్టర్ సంస్థపై ఎటువంటి కామెంట్ చేయలేదు.

దేశంలో తగ్గుతున్న కరోనా ఉధృతి? కొత్తగా 44,111 కరోనా కేసులు

న్యూఢిల్లీ, జులై 3:దేశంలో కరోనా వైరస్ ఉధృతి క్రమంగా తగ్గుతోంది. రోజువారీ కేసులతో పాటు మరణాలు సైతం తగ్గుతున్నాయి. గడిచిన 24 గంటల్లో దేశంలో కొత్తగా 44,111 కొత్త కేసులు రికార్డయ్యాయని కేంద్ర కుటుంబ, ఆరోగ్యమంత్రిత్వ శాఖ శనివారం తెలిపింది. తాజాగా 57,477 మంది బాధితులు వైరస్ నుంచి కోలుకొని డిశ్చార్జి అయ్యారు. వైరస్ ప్రభావంతో 24 గంటల్లో 738 మరణాలు నమోదయ్యాయని చెప్పింది. తాజాగా నమోదైన కేసులతో దేశంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 3,05,02,362కు పెరిగాయి. 2,96,05,779 మంది బాధితులు కోలుకున్నారు.

ఇప్పటివరకు కరోనా వైరస్ కారణంగా 4,01,050 మంది మృత్యువాత పడ్డారు. మరో వైపు దేశంలో యాక్టివ్ కేసులు 95 రోజుల తర్వాత 5 లక్షలకు దిగువకు చేరాయి. ప్రస్తుతం 4,95,533 యాక్టివ్ కేసులున్నాయని పేర్కొంది. టీకా డ్రైవ్‌లో భాగంగా ఇప్పటి వరకు 34,46,11,291 డోసులు పంపిణీ చేసినట్లు తెలిపింది. రికవరీ రేటు 97.06 శాతానికి పెరిగిందని, వీక్లీ పాజిటివిటీ రేటు 2.50శాతంగా ఉందని, రోజువారీ పాజిటివిటీ రేటు 2.35 శాతంగా ఉందని వివరించింది. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 41.64 కోట్ల కరోనా పరీక్షలు నిర్వహించారు.

ప్రకాశం బ్యారేజీ 20 గేట్లు ఎత్తివేత.. 8,340 క్యూసెక్కుల నీరు సముద్రం పాలు

హైదరాబాద్ , జులై 3:ఎగువ ప్రాంతాల్లో వర్షాల కారణంగా కృష్ణా నదిలోకి భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో తెలంగాణ జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ నీటిని దిగువకు విడుదల చేస్తోంది. ఈ మేరకు విజయవాడలోని ప్రకాశం బ్యారేజీకి నీటి ప్రవాహం వచ్చి చేరుతోంది. మొత్తం 20 గేట్ల ద్వారా 8,340 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. ప్రకాశం బ్యారేజీలో ప్రస్తుతం 3.07 టీఎంసీల నీటి నిల్వ ఉంది. దీంతో అదనపు నీటిని నిల్వ చేయలేని పరిస్థితిలో నీటి ప్రవాహాన్ని సముద్రంలోకి విడిచిపెడుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఎగువ ప్రాంతాల నుంచి పులిచింతల ప్రాజెక్టుకు 39,700 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. తెలంగాణ జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 7,200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తోంది. మరోవైపు నాగార్జున సాగర్ రిజర్వాయర్ నుంచి 62,446 క్యూసెక్కులు, శ్రీశైలం నుంచి 21,229 క్యూసెక్కుల నీరు దిగువ ప్రాంతాలకు విడుదల అవుతోంది.

పెండింగ్ సమస్యలను పరిష్కరించండి

రాజన్న సిరిసిల్ల, జులై 3: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ . రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రాజన్న సిరిసిల్ల జిల్లా లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు విచ్చేస్తున్న సందర్భంగా ముంపు గ్రామ సమస్యల గురించి అలాగే వేములవాడ రాజన్న సాక్షిగా 5 లక్షల 4 వేల అలాగే యువతకు ఉపాధి పెండింగ్ సమస్యలు వెంటనే అమలు చేయాలని కోరడం జరిగింది అలాగే అక్రమ అరెస్టులను కూడా తీవ్రంగా ఖండించడం జరిగింది జరిగింది . ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి బుర్ర శేఖర్ గౌడ్ రుద్రవరం ఎంపీటీసీ గాలి పెళ్లి సువర్ణ స్వామి గౌడ్ రుద్రవరం బిజెపి గ్రామ అధ్యక్షులు సింగిల్ విండో డైరెక్టర్ గోనె భాస్కర్ వేములవాడ అర్బన్ మండల ప్రధాన కార్యదర్శులు . కాసర్ల అరుణ్ కుమార్ చంద్రగిరి ప్రశాంత్ బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు మంత్రి రమేష్ దళిత మోర్చా మండల అధ్యక్షులు ఎరగోకుల రమేష్ కిసాన్ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి కూతురు బక్కయ్య దాసరి నాగరాజు వడుగు అంజయ్య ఏం బేరి రాజనర్సు తదితరులు పాల్గొనడం

విద్యార్థుల శాటిలైట్ టీవీ క్లాస్‌లకు ఇస్రో సహకారం..

న్యూఢిల్లీ, జులై 3:భారతదేశంలో విద్యార్థులకు ఉపగ్రహ టీవీల ద్వారా పాఠ్యాంశాలను బోధించడానికి రంగం సిద్ధం చేసింది కేంద్ర సర్కారు. దేశీయ ఉపగ్రహాలన్నీ ఇస్రో ఆధీనంలో ఉన్నాయి. ఆయా సేవలను వినియోగించుకోవడానికి అనుమతిని తీసుకోవాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి పార్లమెంటరీ ప్యానెల్ ప్రతిపాదనలకు ఇస్రో అంగీకారం తెలిపింది.

అంతేకాదు రాష్ట్రాలకు శాటిలైట్ హక్కులను బదలాయించడానికి కూడా ఇస్రో తన సంసిద్ధతను వ్యక్తం చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో శాటిలైట్ టీవీల ద్వారా పాఠ్యాంశాలను బోధించే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి తమవంతు సహకారం అందిస్తామని ఇస్రో ప్రకటించింది. వాటిని ఎలా వినియోగించాలనే అంశంపై సాంకేతిక సహకారాన్ని సైతం అందించడానికి సిద్ధమని స్పష్టం చేసింది.కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిన విషయం తెలిసిందే.

ఈ కారణంగా వారి విద్యా సంవత్సరాన్ని కోల్పోవాల్సి వచ్చింది. దీనివల్ల వచ్చిన గ్యాప్‌ను భర్తీ చేయడంలో సహకారం అందిస్తామని ఇస్రో తెలిపింది. శాటిలైట్ టీవీల ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించాలనే విషయంపై కేంద్ర సమాచార, సాంకేతిక మంత్రిత్వ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఇస్రో శాస్త్రవేత్తలు, దూరదర్శన్ అధికారులు హాజరయ్యారు.

అంతేకాకుండా ఉత్తర ప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, తెలంగాణ, అరుణాచల్ ప్రదేశ్‌లకు చెందిన విద్యాశాఖ కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. టీవీల ద్వారా పాఠ్యాంశాలను బోధించడంలో తమ ఆధీనంలో ఉన్న శాటిలైట్లను వినియోగించుకోవడానికి ఎలాంటి అభ్యంతరం లేదని ఇస్రో శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. వాటిని ఎలా వినియోగించాలనే విషయంపై అధికారులకు శిక్షణ కూడా ఇస్తామని, రాష్ట్రాలకు శాటిలైట్ల హక్కులను బదలాయించడానికి కూడా సిద్ధమని అన్నారు.

'యుయస్ జాతి పిత' జార్జి వాషింగ్టన్ సేవలు అద్వితీయం

(04 జూలై 'అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం' సందర్భంగా)

ఇంగ్లాండ్ పాలనలో ఉన్న అమెరికా సంయుక్త రాష్ట్రాలు చేపట్టిన అమెరికన్ విప్లవం ఫలితంగా 04 జూలై 1776న స్వాతంత్ర్యాన్ని పొంది స్వేచ్ఛా గాలులు పీల్చడం జరిగింది. ఈ మహోఘట్టాన్ని పురస్కరించుకొని 04/05 జూలై రోజున అమెరికాలోని 50 రాష్ట్రాలు సెలవు దినాన్ని పాటిస్తున్నాయి. 1812 జరిగిన యుద్ధానంతరం 'యుయస్ ఇండిపెండెన్స్ డే' వేడుకలను ఘనంగా పాటించటం ప్రారంభించారు. 1870 తరువాత స్వాతంత్ర్య దినం రోజున ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవు దినంగా పాటించుట జరుగుతున్నది. ఈ ఉత్సవాల్లో భాగంగా దేశవ్యాప్తంగా కవాతులు, వినోదాలు, సభలు, సమావేశాలు, క్రీడలు, కుటుంబ కలయికలు, బాణాసంచాల జిలుగు వెలుగులు, విహార యాత్రలు లాంటి వేడుకల్లో ప్రతి ఒక్కరు చురుకుగా పాల్గొంటూ సంబరాల్లో మునిగి తేలుతారు. అప్పటి వరకు బ్రిటన్‌కు చెందిన 'కింగ్ జార్జ్ – 3' చక్రవర్తి పాలనలో 13 అమెరికన్ కాలనీలు ఉండేవి. నాటి బ్రిటన్ పాలనలోని అమెరికన్ ఖండపు కాంగ్రేస్ 02 జూన్ 1776న స్వాతంత్ర్య ప్రకటనకు సంబంధించిన తీర్మానం చేసినప్పటికీ 04 జూలైన మాత్రమే స్వాతంత్ర్య ప్రకటనపై సంతకాలు చేయడం జరిగింది. 'థామస్ జఫెర్సన్' నాయకత్వంలో ఏర్పడిన ఐదుగురు సభ్యుల కమిటీ స్వాతంత్ర్య ప్రకటనను తయారు చేశారు. ఈ కమిటీలోని థామస్ జఫెర్సన్, జాన్ ఆడమ్స్, బెంజిమన్ ఫ్రాంక్లిన్ ఒక వైపు మరియు ఇంగ్లాండ్ పాలకులు మరో వైపు ఏకగ్రీవంగా స్వాతంత్ర్య ప్రకటనపై సంతకం చేయడం జరిగింది.

స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటన్ చక్రవర్తి పాలనలో అమెరికన్లు దుర్భర బానిసలుగా బతకడం జరిగిందని, 'జార్జ్ వాషింగ్టన్' నేతృత్వంలో స్వాతంత్ర్యం కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు, పోరాటాలు జరిగాయని చరిత్ర వివరిస్తున్నది. ఈ కారణంగానే తనదైన అమెరికన్ రాజ్యాంగంతో పాలన చేసిన తొలి అధ్యక్షుడు (1789–1797) జార్జ్ వాషింగ్టన్‌ను 'అమెరికా సంయుక్త రాష్ట్రాల జాతి పిత (ఫాదర్ ఆఫ్ యుయస్)'గా పిలవడం జరుగుతున్నది. తనకంటూ ఒక అమెరికన్ రాజ్యాంగం లేకుండానే 1776 నుంచి 1789 వరకు ఎనిమిది మంది అధ్యక్షులు సేవలు అందించారు. 1787లో ఏర్పడిన అమెరికా రాజ్యాంగ రచన చేసిన కమిటీకి జార్జ్ వాషింగ్టన్ చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తూ ప్రధాన భూమికను నిర్వహించారు. 'డిక్లరేషన్ ఆఫ్ ఇండిపెండెన్స్' ప్రకటనపై సంతకాలు చేసిన థామస్ జఫర్సన్ మరియు జాన్ ఆడమ్స్‌లు అనంతరం అమెరికా అధ్యక్షులుగా పని చేయడమే కాకుండా ఇద్దరు 50వ స్వాతంత్ర్య వేడుకలు జరుగుతున్న రోజు 04 జూలై 1826న తుది శ్వాస విడవడం జరిగింది. అదే విధంగా మరో అమెరికా అధ్యక్షుడు జేమ్స్ మన్రో కూడా 04 జూలై 1831న తుది శ్వాస విడవడం జరిగింది. 04 జూలై 1872న జన్మించిన కెల్విన్ కూలిడ్జ్ కూడా యుయస్ అధ్యక్షుడిగా పని చేశారు. స్వాతంత్ర్యం పొందిన అమెరికాకు 46వ అధ్యక్షుడిగా నేడు జో బైడెన్ సేవలను అందించుట మనకు తెలుసు. 1776కు పూర్వం నేటి అమెరికా సంయుక్త రాష్ట్రాలను 'కాంటినెంటల్ కాంగ్రేస్'గా పిలిచేవారు. జార్జ్ వాషింగ్టన్ ప్రభుత్వం హయాంలో 1792లో ప్రారంభమైన 'వైట్ హౌజ్' నిర్మాణం 1800 వరకు కొనసాగింది. శ్వేతసౌధంలో అడుగిడిన తొలి అధ్యక్షుడిగా 'జాన్ ఆడమ్స్' చరిత్రలో నిలిచారు. నేడు అమెరికా పౌరసమాజం 245వ స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపుకుంటున్న శుభ గడియల్లో మనందరం శుభాకాంక్షలు తెలియజేద్దాం. 'హాపీ ఇండిపెండెన్స్ డే టు అమెరికన్స్'.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

రేపు ముఖ్యమంత్రిగా పుష్కర్‌సింగ్ ప్రమాణం: కేంద్రమంత్రి తోమర్

డెహ్రాడూన్, జులై 3:: ఇవాళ బీజేఎల్పీ నేతగా ఎన్నికైన పుష్కర్‌సింగ్ ధామి రేపు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నారని కేంద్రమంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు నరేంద్రసింగ్ తోమర్ చెప్పారు. ఈ మధ్యాహ్నం డెహ్రాడూన్ లోని బీజేపీ హెడ్‌క్వార్టర్స్‌లో జరిగిన బీజేఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలంతా కలిసి పుష్కర్‌సింగ్ ధామిని తమ నాయకుడిగా ఎన్నుకున్నారని తోమర్ వెల్లడించారు. బీజేపీఎల్పీ నాయకుడి ఎన్నిక అనంతరం తాము రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ బేబీ రాణి మౌర్యను కలిశామని చెప్పారు.పార్టీ నిర్ణయం గురించి గవర్నర్‌కు తెలియజేసి, నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి సంబంధించి వారికి వినతిపత్రం అందజేశామని చెప్పారు. రేపు ఉత్తరాఖండ్ 11వ ముఖ్యమంత్రిగా ధామి ప్రమాణం చేయబోతున్నారని తోమర్ తెలియజేశారు. అనంతరం పుష్కర్‌సింగ్ తోమర్ మాట్లాడుతూ.. పార్టీ తననెప్పుడూ తల్లిలా తన రెక్కల కింద దాచుకున్నదని చెప్పారు. పార్టీ ఇంతగొప్ప అవకాశం ఇవ్వడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. క్యాబినెట్‌లో మార్పుల గురించి చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

కేసీఆర్ మార్క్ పాలనకు రైతువేదికలు ఉదాహరణలు

సూర్యాపేట, జులై 3: : సీఎం కేసీఆర్ మార్క్ పాలనకు రైతు వేదికలు గొప్ప ఉదాహరణలు అని హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో శనివారం జరిగిన 4వ విడత పల్లె ప్రగతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం రైతు వేదికను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతువేదికల నిర్మాణం దేశంలోనే ఒక చరిత్ర అన్నారు. రైతుల బాధలు తెలిసిన నాయకుడు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితే రైతుల సంక్షేమ పథకాల అమలు ఇలానే ఉంటుందన్నారు. రైతు సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.

ఆవులను వధించకండి..చట్టాలను గౌరవించండి..!

–దేశ సమైక్యత..సమగ్రతకై నిషేధాజ్ఞలను ఉల్లంఘించకండి
ముస్లిం సమాజానికి ఎంఐఎం నేత అబ్బాస్ సమి పిలుపు

రాజన్న సిరిసిల్ల, జులై 3: (నేటినిజం ప్రతినిధి): దేశాన్ని ప్రేమించే ప్రతి ముస్లిం..దేశ ఔన్నత్యం కోసం గోవధ నిషేధ చట్టాన్ని పాటించాలని ఎంఐఎం సీనియర్ నేత, మాజీ డిప్యూటీ మేయర్ మహమ్మద్ అబ్బాస్ సమి× యావత్తు ముస్లిం సమాజానికి పిలుపునిచ్చారు. ఈసందర్భంగా శనివారం అబ్బాస్ సమి మాట్లాడుతూ బక్రీద్ పండుగ సమీపంలో ఉన్నందున ముస్లింలు ఖుర్బానీ పేరిట ఆవులను వధ చేయరాదని పేర్కొన్నారు. గోవధ నిషేధ చట్టం–1977,పశువుల పట్ల క్రూరంగా ప్రవర్తన నిషేధిత చట్టం–1960 ప్రకారం ఆవులను అమ్మినా, కొనుగోలు చేసినా వారిపై పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని కావున ముస్లింలు జాగ్రత్తలు వహించాలని సూచించారు. దేశంలోని చట్టాలను గౌరవిస్తూ, దేశ సమైక్యత,సమగ్రత కోసం ఆవులను వధించకూడదని, ప్రభుత్వం నిషేధం విధించినపుడు, నిషేధాజ్ఞలు అమలులో ఉన్నప్పుడు నిబంధనలు ఉల్లంఘించకూడదని ముస్లిం సమాజానికి పిలుపునిచ్చారు. పవిత్ర బక్రీద్ మాసంలో ఖుర్బానీ (బలి) ఇచ్చే జంతువుల్లో ఆవులను వధించకూడదని,ఇది చట్ట రీత్యా నేరమన్నారు. ఇటువంటి సున్నిత విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇస్లాం ధర్మం ప్రకారం మనం చేసే, నిర్వహించే పనులు,కార్యాలు, కార్యక్రమాలతో సమాజంలో నివసించే తోటి ప్రజల మనోభావాలకు ఇబ్బంది కలుగ కుండా ఉండాలని, ఆవిధంగా మెదలుతూ జీవించాలని మహనీయ మహమ్మద్ ప్రవక్త (సల్లం) సెలవిచ్చారని పేర్కొన్నారు. ఇస్లాం సంస్కృతి, సాంప్రదాయలకు పెట్టింది పేరని,అందుకు విరుద్ధంగా ప్రవర్తించడానికి వీలు లేదన్నారు.అన్ని మతాల వారిని గౌరవిస్తూ గంగా–జమునా తెహజీబ్ ను పెంపొందిస్తూ, మతసామరస్యాన్ని పాటిస్తూ శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడి పై ఉందన్నారు. మొన్న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన శాంతి కమిటీ సమావేశంలో సైతం ఆవులను వధించకు ండా నగరంలోని అన్ని మజీదుల్లో ఏలాన్ చేసి ముస్లింలకు అవగాహన కల్పించే బాధ్యత తీసుకుంటామని, మా మత పెద్దలతో ఈ విషయమై అంతర్గతంగా చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పానని తెలిపారు. ప్రస్తుతం కరోనా వ్యాధి రెండోదశ డెల్టా వేరియంట్ ఉగ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు భౌతిక దూరం పాటిస్తూ, విధిగా మాస్కులు ధరించి, ఎప్పటికప్పుడు చేతులు సానిటైజ్ చేసుకోవాలన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత...జడ్పిటిసి నాగం

రాజన్న సిరిసిల్ల, జులై 3: (నేటినిజం ప్రతినిధి): పల్లె ప్రగతి లో నాటిన మొక్కలను రక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చందుర్తి జడ్పిటిసి సభ్యులు నాగం కుమార్ అన్నారు, మండలంలోని మల్యాల గ్రామంలో పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు,

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చి దిద్దుటకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ అబ్రహం, జోగాపూర్ ఎంపీటీసీ మ్యాకల గణేష్. వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు,

షాదీఖానా నిర్మాణ పనులను పూర్తి చేయించండి మంత్రి కేటీఆర్‌కి ముస్లింల వినతి

రాజన్న సిరిసిల్ల, జులై 3: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో గత 20 సంవత్సరాలుగా నిర్మాణ దశలో ఉన్న షాదీఖానా పనులను వెంటనే పూర్తి చేయించాలని వేములవాడ ముస్లిం కమిటీ పెద్దలు ,టీఆర్ఎస్ మైనార్టీ నాయకులు నాయకులు శనివారం రోజున పట్టణ ప్రగతి కార్యక్రమంలో పాల్గొనడానికి వేములవాడకు వచ్చిన మంత్రి కేటీఆర్ కు ఓ వినతిపత్రం సమర్పించారు . అంతేకాకుండా కబిస్తాన్ కు కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని పూర్తి చేయించాలని వినతిపత్రంలో కోరారు . ఈ కార్యక్రమంలో మునిసిపల్ కోఆప్షన్ మెంబర్ షేక్ బాబున్ , మొహమ్మద్ మసీద్ కమిటీ అధ్యక్షులు షేక్ ఇమామ్, యండి బషీర్ , ముస్లిం కమిటీ మాజీ పట్టణ అధ్యక్షుడు అంజాద్ పాషా . టీఆర్ఎస్ మైనార్టీ నాయకులు యంఏ రఫిక్ , ఎం ఏ రాహిల్ , ఇబ్రహీం , ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌పై దురుసు వ్యాఖ్యలు : వర్సిటీ విద్యార్థికి రూ 5000 జరిమానా

న్యూఢిల్లీ, జులై 3: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై ఆన్‌లైన్‌లో అమర్యాదకర వ్యాఖ్యలు చేసిన అంబేద్కర్ వర్సిటీ ఫైనల్ ఇయర్ విద్యార్థికి రూ 5000 జరిమానా విధించారు. గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన వర్సిటీ వార్షిక స్నాతకోత్సవం సందర్భంగా విద్యార్థి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. కేజ్రీవాల్ ముఖ్యఅతిథిగా గత ఏడాది డిసెంబర్ 23న జరిగిన వర్సిటీ స్నాతకోత్సవంలో యూట్యూబ్ ద్వారా పలువురు పాల్గొన్నారు. ఈ క్రమంలో యూట్యూబ్ చాట్‌రూమ్ ద్వారా కార్యక్రమానికి సదరు విద్యార్థి విఘాతం కల్పించాడు.విద్యార్థి చేసిన వ్యాఖ్యలు గౌరవప్రదంగా లేవని, కేజ్రీవాల్‌ను కించపరిచేలా ఉన్నాయని వర్సిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. క్రమశిక్షణను ఉల్లంఘించి దురుసుగా ప్రవర్తించిన విద్యార్థిపై చర్యలు చేపట్టామని తెలిపింది. కాగా యూనివర్సిటీ ఫీజుల పెంపుకు నిరసనగా ఆన్‌లైన్‌లో గళమెత్తినందుకే విద్యార్థిపై రూ 5000 జరిమానా విధించారని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) ఆరోపించింది.

యు.ఎస్. పసిఫిక్ నార్త్‌వెస్ట్ ప్రపంచ ప్రఖ్యాత చెర్రీలు మార్కెట్లోకి

హైదరాబాద్ , జులై 3:వేసవి అంటే తాజా పండ్లతో నిండిన ఒక మెనూ మరియు ఈ సీజన్ చెర్రీని అన్నింటికంటే అగ్రభాగాన ఉంచుతుంది. యు.ఎస్. పసిఫిక్ నార్త్‌వెస్ట్ నుండి పెద్ద డీప్–మహోగని ఎరుపు, పండిన, జ్యూసి, తీపి మరియు అత్యంత రుచికరమైన చెర్రీస్ మార్కెట్లోకి వచ్చాయి. యు స్ ఎంబసీ, వ్యవసాయ వ్యవహారాల మంత్రి–కౌన్సిలర్ మిస్టర్ రాన్ వెర్డోంక్ జెనెరిక్ ప్రమోషనల్ క్యాంపెయిన్‌భారతదేశం అంతటా ప్రముఖ రిటైల్ దుకాణాలు మరియు ఇ–కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో ఆకర్షణీయమైన డిస్ప్లే కనిపిస్తుంది నార్త్‌వెస్ట్ చెర్రీ సాగుదారులు అనేది, యుఎస్ఎలోని వాషింగ్టన్ రాష్ట్రంలో ఉన్న ఒక వాణిజ్య సంఘం.వివేకం కలిగిన ఆరోగ్య స్పృహ ఉన్న భారతీయ వినియోగదారులకుఈ సంతోషకరమైన పండ్లను పరిచయం చేయడానికి భారతదేశంలో వారి మొట్టమొదటి జెనరిక్ ప్రమోషన్ ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి గుర్తుగా, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా రాయబార కార్యాలయ వ్యవసాయ వ్యవహారాల మంత్రి–కౌన్సిలర్ రాన్ వెర్డోంక్, చాన్యకాపురిలోని ఫుడ్‌హాల్‌లో ప్రమోషన్ ప్రచారాన్ని ప్రారంభించారు. రిటైలర్ అమెరికన్ నార్త్‌వెస్ట్ నుండి చెర్రీస్ యొక్క ఆకర్షణీయమైన ఆరోగ్యకరమైన ప్రదర్శనను ఏర్పాటు చేసింది. మొదటి వినియోగదారు ప్రతిస్పందన ద్వారా ప్రోత్సహించబడింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మిస్టర్ వెర్డోంక్ ఇలా వ్యాఖ్యానించారు, " ప్రపంచంలోనే అతిపెద్ద తీపి చెర్రీలను ఉత్పత్తి మరియు ఎగుమతి చేసే దేశాలలో యు.ఎస్. ఒకటి. యు.ఎస్. పసిఫిక్ నార్త్‌వెస్ట్ నుండి వచ్చిన ఈ చెర్రీలను వాషింగ్టన్, ఒరెగాన్ ఇడాహో, ఉటా మరియు మోంటానా రాష్ట్రాల్లో పండిస్తారు. ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులు తీపి రుచి, పెద్ద పరిమాణం అత్యుత్తమ నాణ్యతను ఆనందిస్తారు. భారతదేశంలో వాటిని చూడటం నాకు చాలా ఆనందంగా ఉంది. భారతదేశం– యు.ఎన్. వాణిజ్యంలో ఆహారం చాలా ముఖ్యమైన భాగం, మా పసిఫిక్ నార్త్‌వెస్ట్ నుండి చెర్రీస్ ఇప్పుడు భారతదేశంలో అందుబాటులో ఉన్నందుకు నేను సంతోషిస్తున్నాను. "భారతదేశంలో నార్త్ వెస్ట్ చెర్రీస్ ప్రచారంపై మాట్లాడుతూ, ఎన్‌డబ్ల్యుసిజి యొక్క దేశీయ మార్కెటింగ్ ప్రతినిధిసుమిత్ సరన్ ఇలా మాట్లాడారు,"భారతదేశంలో నార్త్‌వెస్ట్ చెర్రీస్ కోసం అపారమైన అవకాశాలను మేము ఊహించాము.ఈ చెర్రీస్ అధిక నాణ్యత, కమ్మదనం, రుచి ఆహార భద్రత వంటి అంశాలలో ప్రపంచంలోని ఉత్తమమైన వాటిలో ఒకటిగా పరిగణించబ డతాయి. పసిఫిక్ నార్త్‌వెస్ట్ యుఎస్ఎ నుండి చెర్రీస్ జూలై ఆగస్టులలో మార్కెట్లో అందుబాటులో ఉంటాయి,భారత చెర్రీ సీజన్‌ను ఇది సంపూర్ణంగా పూర్తి చేస్తుంది.ఈ రుచికరమైన పండ్లను దేశవ్యాప్తంగా ఉన్న భారతీయ వినియోగదారుల వద్దకు తీసుకెళ్లడానికి మేము విస్తృతమైన రిటైల్ కమ్యూనికేషన్ వ్యూహాన్ని రూపొందించాము. ఈ చెర్రీస్ రిటైల్ పండ్ల అమ్మకందారుల వద్ద ఇ–కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో లభిస్తాయి. "అని సరన్ తెలిపారు

ఒకే ప్రపంచం ఒకే ఆశ ఒకే వాగ్దానం

హైదరాబాద్ , జులై 3:ది ఈ యాంథమ్ ఏడుగురు ప్రసిద్ధ వోకలిస్టులు అల్కా యాగ్నిక్, శ్రేయా ఘోషాల్. కె.ఎస్. చిత్ర, సాధనా సరగమ్, షాషా తిరుపతి, అరమాన్ మలిక్ మరియు అశీష్ కౌర్ లను ఫీచర్ చేస్తున్నది. నిరాశ సమయాలలో, మనసుని ఆహ్లాదంతో నింపే మెలోడీస్ తో పాటు ప్రేరణ కలిగించే మాటలు టన్నల్ తర్వాత వెలుగు కిరణాలు చూడానికి సహాయం చేస్తాయి. ఈ విశ్వాసంతో సోనీ మ్యూజిక్ ఇండియా, నేషనల్ అవార్డ్ విన్నర్ గుల్జార్ మరియు గ్రామీ మరియు అకాడమీ అవార్డ్ విన్నింగ్. మ్యుజీషియన్ ఎ.ఆర్. రహమాన్ చేతులు కలిపి, హోప్ మరియు హీలింగ్ యాంథమ్ 'మేరీ పుకార్ సునో' తయారుజేసారు. సోనీ మ్యూజిక్ ఇండియా ద్వారా విడుదల చేయబడిన ఈ గీతం వీరి దిల్‌ఈ సే, గురు, స్లమ్ డాగ్ మిలియనైర్, సాథియా మరియు ఓకే సోను వంటి మరుపురాని సమర్పణ అనంతరంఈ ఐకానిక్ఇద్దరిని దగ్గరకు తీసుకువచ్చింది. 'మేరీ పుకార్ సునో' ప్రసిద్ధ నూతన తర వోకలిస్టులు అల్కా యాగ్నిక్, శ్రేయా ఘోషాల్. కె.ఎస్. చిత్ర, సాధనా సరగమ్, షాషా తిరుపతి, అరమాన్ మలిక్ మరియు అశీష్ కౌర్ లతో పాటు ఇండియన్ మ్యూజిక్ ఇండస్ట్రీ లోని అత్యంత ఐకానికి ఆర్టిస్టులను దగ్గరకు తీసుకువస్తున్నది. ఏడు నోట్స్ వలె ఈ విశిష్టమైన కొలాబరేషన్ తరాలు మరియు సంస్కృతుల ఐక్యతకు ఒక సమాంతర ముద్రగా నిలుస్తుంది. ఈ యాంథమ్ మాటీ మా నుండి తన పిల్లలు అందరు ఐక్యంగా ఉండాలని కోరుతున్న ఒక పిలుపు వంటిది మరియు ఇది కూడా కొనసాగుతుందని వారికి మాట ఇవ్వటం వంటిది?. ఇది ఆశవాదాన్ని రేకెత్తించి, మనలోని మైత్రీ భావాన్ని తెలియజేస్తుంది. మన మనసులో విశ్వాసం అనే జ్వాలలు రగులుతూ ఉండాలని కోరుతూ, ఈ గీతం మనకు చీకటి సమయాలు ఎలా భవిష్యత్తులో రాబోయే వెలుగు మరియు సంతోషాలకు సూచనగా నిలుస్తాయి అని తెలియజేస్తుంది. 'మేరీ పుకార్ సునో' అనేది 'ఒకే ప్రపంచం ఒకే ఆశ ఒకే వాగ్దానం' అనే దృఢ విశ్వాసం రూపం లో నాటుకుపోయి ఉంది – కలిసి మనం హీల్ చేస్తాం (ఒకే మాట, ఒకే ఆశ, ఓకే వాగ్దానం.)ఈ గీతం డైరెక్షన్ మరియు మ్యూజికల్ కంపోజిషన్ గురించి మాట్లాడుతూ, మాస్ట్రో ఎ. ఆర్. రహమాన్ ఇలా అన్నారు, "ఈ సారి, ఆ మహమ్మారి సమయంలో ప్రతి ఒక్కరి జీవితంలో ఒక ప్రత్యేకమైన అధ్యాయం ఉంటుంది. చాలా అనిశ్చితి మరియు బాధ ఉంటాటి. అలాగా ఎంతో ప్రతిరోధకత మరియు హీలింగ్ కూడా ఉంటాయి. గుల్జార్ గారు మరియు నేను ఒక ఆశ గీతన్ని తయారు చేయాలని అనుకున్నాము. ఎందుకంటే మన అందరికి సౌఖ్యం మరియు పునః విశ్వాస కావాలి. మేరీ పుకార్ సునో అనేది మదర్ ఇండియా ప్రేరణతో ఆమే తన పిల్లల కోసం తన కుమార్తెలు చేత పాడిస్తున్న గీతం వంటిది. మనుషులు వివిధ కాలాలలో మరియు కష్ట సమయాలలో జీవించారని మరియు ధైర్య సాపాలతోనే ఇది సాధ్యం అని చెప్పటం వంటిది."

బండపల్లి గ్రామాన్ని సందర్శించిన అధికారులు

రాజన్న సిరిసిల్ల, జులై 3: (నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం బండ పల్లి గ్రామంలో కరోనా కేసులు పెరుగుతుండడంతో మండల అధికారులుశనివారం గ్రామాన్ని సందర్శించారు, ఎంపీడీవో రవీందర్, వైద్యాధికారి మసూద్ హమ్మద్, ఎంపీఓ ప్రదీప్ గ్రామాన్ని సందర్శించారు, గ్రామంలో వడ్డెర కాలనీ లో ఇటీవల కరోనా విజృంభించగా గ్రామ సర్పంచ్ న్యాత విజయ జార్జి ఆధ్వర్యంలో గ్రామంలో హైపో క్లోరైడ్ ద్రావణాన్ని పిచికారి చేశారు,గ్రామంలో అంటువ్యాధులు విషజ్వరాలు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రవీందర్ తెలిపారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాసారపు గంగాధర్ గౌడ్ వైద్య సిబ్బంది వజ్ర వసంత రమణ తదితరులు పాల్గొన్నారు,

ఇండోనేషియాలో రికార్డు స్థాయికి కొవిడ్ కేసులు

జకర్తా, జులై 3: ఇండోనేషియాలో కరోనా మహమ్మారి రికార్డు స్థాయికి చేరుకుంది. అక్కడ రోజువారీ కరోనా పాజిటివ్ కేసుల సంఖ్యలో రికార్డు నమోదైంది. గడిచిన 24 గంటల్లో అక్కడ మొత్తం 27,913 మందికి కొత్తగా పాజిటివ్ వచ్చింది. కరోనా వైరస్ ఉద్భవించినప్పటి నుంచి ఇండోనేషియాలో ఒక్కరోజే ఇంత భారీ సంఖ్యలో కొత్త కేసులు నమోదు కావడం ఇదే తొలిసారి.

నిధుల సక్రమ వినియోగంతో గ్రామాల అభివృద్ధి: మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ,జులై 3:: ప్రభుత్వం నుంచి వచ్చే నిధులన్ని సక్రమంగా వినియోగం అయ్యేలా గ్రామస్తులు సమిష్టిగా ముందుకు నడవాలని, అందరి అభిప్రాయాలను తీసుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం జువ్విగూడెంలో నిర్వహించిన పల్లెప్రగతి కార్యక్రమంలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం పెంచాలన్నదే పల్లె ప్రగతి కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు.

సీఎం కేసీఆర్ ఎంతో ముందుచూపుతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. గ్రామ సభలు నిర్వహించి, ప్రతి ఒక్కరి ఇల్లు ఎలాగైతే శుభ్రంగా ఉంచుకుంటారో అదేవిధంగా వీధులను, గ్రామాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పచ్చదనం, పరిశుభ్రత పెంచడమే పల్లె ప్రగతి కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు.

మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. దేశంలో ఏ నాయకుడు చేయని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. భగీరథ పథకం తాగునీటి గోసను తీర్చింది. విషం లాంటి ఫ్లోరైడ్ మహమ్మారిని తరిమికొట్టిన గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. ఆసరా పెన్షన్ లు సమాజంలో పెను మార్పును తీసుకొచ్చాయి. ఈ కరోనా కష్ట సమయంలో కూడా రైతుబంధు పెట్టుబడి ఇచ్చిన మహానుభావుడు సీఎం కేసీఆర్ అన్నారు. వైకుంఠదామంల నిర్మాణంతో గ్రామాల్లో అంత్యక్రియలు హుందాగా జరుగుతున్నాయన్నారు. ప్రతి ఇంట్లో ఆరు మొక్కలు నాటి పెంచాలని పేర్కొన్నారు.

గుడి చెరువు బాధితుల సమస్యలు పరిష్కరించాలని కేటీఆర్ కు వినతి

రాజన్న సిరిసిల్ల, జులై 3: (నేటినిజం ప్రతినిధి): పట్టణంలోని 27వ వార్డు పరిధిలో ఉన్న గుడి చెరువు లో మినీ ట్యాంక్ బండ్ నిర్మాణానికి భూములు కోల్పోయిన నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర మంత్రి కేటీఆర్ కు 27వ వార్డు కౌన్సిలర్ గోలి మహేశ్ వినతిపత్రం అందజేశారు. గతంలో వేములవాడ పర్యటన కు వచ్చిన సీఎం కేసీఆర్ గుడి చెరువు అభివృద్ధి విషయంలో 30 ఎకరాల భూమి సేకరించడం జరిగిందని, రెండవ విడతలో మరో 29 ఎకరాలు మినీ ట్యాంక్ బండ్ నిర్మాణానికి సేకరించి హద్దులు ఏర్పాటు చేయడం జరిగిందని, 5సంవత్సరాలు గడచిన ఇప్పటికి ఎలాంటి పురోగతి లేక భూములు కోల్పోయిన బాధితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. 29 ఎకరాల్లో 120..150 గజాల భూమి ఉన్న వాళ్లు ఇండ్లు కట్టుకోలేక, కుమార్తెల వివాహాలకు భూమి అమ్ముకోలేక మరికొందరు అప్పులు తీర్చలేక ఇక ఆత్మహత్యలే శరణ్యంగా బ్రతుకు జీవితం వెల్లదిస్తున్నారని పేర్కొన్నారు. త్వరితగతిన గుడి చెరువు బాధితుల సమస్యను పరిష్కరించాలని కోరారు.

IN THE COURT OF THE M.A.C.T-CUM-XII ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT AT SECUNDERABAD
M.V.O.P.NO 495 of 2020

Between;
Mrs. S. Andalu